‘శ్రీశా’ శతకము

రచయిత

శ్రీ వంకాయల నారాయణరావు

తాత్పర్య రచయిత

ఆచార్య కె. సర్వోత్తమరావు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2025

SREESHA SATAKAMU

By
Sri Vankayala Narayana Rao

Commentry
Prof. K. Sarvottama Rao

Editor
Dr. Akella Vibhishana sarma
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No.1512
@ All Rights Reserved

First Edition : 2025

Copies : 250

Published by :
Sri J. Syamala Rao, I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devastanams,
Tirupati - 517 501

D.T.P.
Publications Division,
T.T.D, Tirupati

Printed at
Tirumala Tirupati Devasthanam's Press
Tirupati - 517 501

ముందుమాట

తెలుగుసాహిత్యంలో శతక ప్రక్రియ విస్తారమయింది. కవియైన ప్రతిఒక్కరూ, కలం పుచ్చుకొని మొదట తాను సేవించే దేవతామూర్తిపై శతకపద్యాలు కూర్చేవారు. ప్రాస్తావికంగా సామాజికాంశాలను కూడా తమ దృష్టితో ప్రకటించేవారు.

తి.తి.దే.వారు అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని పుస్తకాలను ప్రచురిస్తున్నారు. వీటిలో వేదాలు, పురాణాలు, శాస్త్రాలు, కావ్యాలు, సంకీర్తన గ్రంథాలు, ఆధ్యాత్మిక పుస్తకాలున్నాయి. శ్రీ వంకాయల నారాయణరావుగారి భక్తి రసమంజరి ఈ “శ్రీశా”శతకం. వీరు తిరుపతి వెంకట కవులలో ఒకరైన, శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి శిష్యులు. ఉత్తరాంధ్ర కవులలో పద్యకవిగా ఖ్యాతి గడించిన మహనీయుడు.

‘కందం చెప్పినవాడే కవి’ అని సామెత. ఇందుకు ప్రధానకారణం కందపద్యానికి నియమాలెక్కువ కావడమే. అయినా కందపద్యాలు వ్రాసి మెప్పించిన కవులెందరో. ‘కందమునకు సోమయాజి ఘనుడందురు’ అని తిక్కన సోమయాజిని ప్రస్తుతించిన అంశం మనకు తెలిసినదే. ఆ కోవలో వారే శ్రీ వంకాయల నారాయణరావుగారు.

‘శ్రీశా’ శతకం కందపద్యాల్లోనే రచింపబడింది. ఈ శతకంలో దశావతార వర్ణనలు, కృష్ణావతార కథనాలు ఎక్కువ. విశేషించి కలియుగ ప్రత్యక్షదైవమయిన వేంకటేశ్వరాత్మక పద్యాలు ఆపాత మధురాలు. కలియుగంలో వస్తున్న స్వార్థ చింతనను ఈ శతకకవి తప్పు పట్టాడు. అన్నిటికి మించి నామసంకీర్తన ఒకటే శరణ్యమనే ప్రబోధమూ ఉంది.

"శ్రీశా"మకుటంతో సులభశైలిలో శతకమందించిన రచయిత శ్రీ వంకాయల నారాయణరావుగారికి, నా సాదర నమస్కారములు. ఈ పద్యాలకు, సుందరమైన వ్యాఖ్యానాన్నందించిన ఆచార్య కె.సర్వోత్తమరావు గారికి నా అభివందనాలు. ఈ శతకం పద్యాభిమానుల ఆదరం అందుకొంటుందని విశ్వసిస్తున్నాను.

సదా శ్రీవారి సేవలో...

శ్రీకార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

మనవి

ఉత్తరాంధ్రకవులలో ఒకరైన శ్రీ వంకాయల నారాయణరావుగారు శ్రీశా మకుటంతో కందపద్యాల శతకం వ్రాశారు. తి.తి.దే. ప్రజానీకంలోని అన్నివర్గాలవారికి తగినట్లు పుస్తకప్రచురణ చేబదుతుండడంతో సామాన్యుల రచనలను కూడా అంశం దృష్ట్యా ప్రోత్సహిస్తున్నది. ఆ కోవలో చేరిందే 'శ్రీశా' శతకం. ఇది వైష్ణవశతకవర్గంలో చేర్చదగింది.

రచయిత ఈ శతకపద్యాలకు ముందుగా తన వంశచరిత్రను ప్రకటించాదు. శ్రీశాశతకంలో దశవిధ అవతారాల ప్రసక్తితోబాటు శ్రీకృష్ణలీలలు తదనంతరం కలియుగనాథుడయిన శ్రీవేంకటేశ్వర స్వామివారి విశేషాలు వర్ణితాలు. కవికి నామావళికీర్తన ప్రియమయినట్లు శతక పద్యాలబట్టి తెలుస్తున్నది.

ఈ శతకంలో కవి తిరుమల గర్భగుడిలో దీపంగా వెలగాలని కోరుకొన్నాడు. ఆళ్వారులు గడపగా ఉండాలని కోరుకుంటే ఈ కవి దీపంగా కోరుకోవడంలో అంతరార్థముంది.

కవి సమాజంలో ఒకడు కనుక ఈ శతకంలో సామాజికాంశాలను కూడా ప్రస్తావించాడు. సామాన్యజనులకు తగినరీతి వ్రాయబద్ధ శతకం సామాన్యులను మెప్పించవచ్చని నా అభిప్రాయం.

దీపముగా పుట్టించిన
నీపయి చిరువెల్గు చిమ్మియుందును దేవా!
నీ పదపీఠంబైనను
శ్రీపతి నిను మోయుచుందును శ్రీవర శ్రీశా!

కవి భక్తిప్రకటనకు ఈ పద్యమొక్కటి చాలు.

– డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ

గురు ప్రార్థన

ధర చెళ్ళపిళ్ళ కులజులు
అరయగ శ్రీరామదాసు యనఘులు మరియున్
వర సద్గురువరు శ్రీశుభ
చరణయుగళి మ్రొక్కులిడుదు సంతోషమునన్.

తాత్పర్యము : ఈ పద్యం గురువందనాన్ని ప్రకటింపజేసేది. భగవంతుని తరువాత దైవస్వరూపులయిన గురువులను స్మరించడం ఆర్షసంప్రదాయం. దైవానుగ్రహంకంటె గుర్వనుగ్రహం గొప్పది కనుక ఈ శతకకర్త చెళ్ళపిళ్ళ కులజులైన శ్రీరామదాసులకు అలాగే సద్గురువరుల పవిత్రపాదాలకు మ్రొక్కులు చెల్లిస్తున్నాడు. ఆ గురువులు పాపరహితులు. అంతేకాదు సర్వ శుభప్రదాతలని విశేషార్థం.

క॥ శ్రీ గణనాథుకు మ్రొక్కెద
ఆగక నా రచన యంత అవనీస్థలిపై
బాగుగ సాగగఁ జేయుచు
నాగవదను కరుణ ఎప్డు నాపైఁ గురియన్ 1

తాత్పర్యము : ఏనుగు మొగమువాని దయ నాపై ప్రసరిస్తుండగా నేను మొదలుపెట్టిన శతకరచన ఈ భూమండలంపై ఆటంకాలు ఏవీ కలుగకుండా సాగాలని నేను శ్రీగణనాథునికి మొక్కుతున్నాను.

ఉ॥ శారద చంద్రికా ధవళచారు శుభాంగి! సురేంద్రవంద్య! వి
స్తారదయానిధీ! సకలశాస్త్రనిధాన! విధాతరాణి! ఇం
పారగ మద్రసజ్ఞత కృపామతి నిల్పి మృదూక్తులీవుతన్
వారక నీదు పాదవనజమ్ముల గొల్తు గదమ్మ భారతీ! 2

తాత్పర్యము : భారతీ! శరత్కాలంలోని వెన్నెలలాగా తెల్లని, అందమైన దర్శనీయమైన అంగములు కలదానా! దేవేంద్రునిచే కొలువబడే స్వామినీ!

హద్దులేని, అవధిలేని దయకు నిధిలాంటిదానివి. సకలశాస్త్రాదులకు నిధానమవు. బ్రహ్మదేవుని రాణివి. అమ్మా! నీవు నా నాల్కపై నిల్చి మృదూక్తులు పలికేలా చేయవమ్మా! నిన్ను నీ పాదపద్మాలను సదా సేవించేవాణ్ణి కదమ్మా!

మ॥ ఉరులక్ష్మీకర! సద్గుణాకర! వరాయుర్వేదవిద్యాదురం
ధర! నిత్యాదర సర్వబంధుజన మిత్రప్రీతిసంధాన త
త్పర! వంకాయలవారి వంశనిధిచంద్రా! చిన్నికృష్ణాఖ్యా! మ
మ్మరయన్ శ్రీపతి! పుత్ర పౌత్ర ధన ధాన్య శ్రీయుతున్ చేయుతన్. 3

తాత్పర్యము : 'శ్రీశ' శతకరచయిత తన వంశంలో జనించిన వంకాయల చిన్నికృష్ణుల గుణగణాలను ఈ పద్యంలో ఆవిష్కరించాడు. చిన్నికృష్ణయ్య సామాన్యుడుకాడు. సంపదలకు నిలయం. అలాగే సద్గుణాలకు ఆకరం. లౌకికవిద్యలలో, సర్వశ్రేష్ఠమయిన ఆయుర్వేదవిద్యలో గట్టిపట్టు కలవాడు. అంతేకాదు చుట్టాలపట్ల, స్నేహితులపట్ల ఆదరభావం కలవాడు. వంకాయల వంశమనే నిధికి చంద్రునిలాంటివాడు. మమ్ము ఆ శ్రీపతి పుత్రపౌత్ర ధనధాన్యసంపద్యుక్తుని చేయుగాత!

క॥ భారద్వాజసగోత్రులు
సూరన జోగాంబ గర్భశుక్తిని ముక్తా
తోరపు ఫలమై వెలసిన
ఆ రమణియె సీతమాంబ అమ్మగు నాకున్. 4

తాత్పర్యము : రచయిత తల్లిని ఈ పద్యంలో పరిచయం చేస్తున్నాడు. ఆ తల్లి పేరు 'సీతమాంబ'. ఆమె జోగాంబసూరనల కుమార్తె. వారు భారద్వాజసగోత్రులు. తల్లిని ముత్యంతో పోల్చడంలో ఆమె సచ్ఛీలవతి అని ఆదరణీయ అని వందనార్హ అని సూచితం. మాతృశబ్దానికి పర్యాయపదాలెన్నో వున్నా కవి 'అమ్మ' అనడంలో ఆప్యాయత, ప్రీతి, అనుభూతి అన్నీ వ్యక్తమౌతాయి.

ఉ॥ మానితవర్తనుండు జనమాన్యతనందిన చిన్నికృష్ణుడున్
మానసములుప్పతిల్లగను మానిని ఛాయను బెండ్లియాడి య
మ్మానిని యందు పుత్రులను ముగ్వురి గాంచెను వారలందునన్
గానగనోపు నా జనకవర్యులు స్వామి కనిష్ఠపుత్రుడై. 5

తాత్పర్యము : నా తాత చిన్నికృష్ణనామధేయుడు. అతడు అందరుమెచ్చిన గౌరవమందుకొన్న నడవడికలవాడు. నా తండ్రి 'ఛాయను' వివాహ మాడాడు. ఆమె మానిని. ఆ దంపతులకు ముగ్వురు సంతానం. వారిలో నా తండ్రి చివరివాడు.

'వంశకీర్తన' ప్రశంసకోసం కాదు. సనాతనధర్మసంప్రదాయంలో ఒకటే పెద్దలపట్ల గౌరవాదరాలు తెలిపేది.

క॥ జనకులు గోపాలునకున్
తనయుల మిర్వురము మేము దగ నగ్రజుడౌ
తనయుడు నారాయణుడును
వనమాలి పదాబ్జనుతుడు వసుమతియందున్. 6

తాత్పర్యము : మా తండ్రి గోపాలునకు ఇద్దరు కుమారులు. నేనూ, నా అగ్రజుడు నారాయణుడు. నా అన్న కూడా వనమాలి అయిన మహావిష్ణువు పాదపద్మాలను సదా నుతించే వసుధలో ప్రసిద్ధికెక్కినవాడు.

క॥ శ్రీపతి! మాధవ! నాదగు
పాపంబులు పారద్రోలి పాలించుమయా
గోపాలదేవ! మురహర!
ఆపదలను జగతిఁగావు మచ్యుత! శ్రీశా! 7

తాత్పర్యము : శ్రీశా! అన్ని రకాలైన సంపదలకు అధిపతి అయినవాడా! లక్ష్మీదేవికి మగడైనవాడా! మనసా, వాచా, కర్మణా నేను చేసిన పాపాలను దూరంగా నెట్టివేసి నన్ను కాపాడు. స్వామీ! నీవు సామాన్యుడవు కావు.

గోవులకు, గోపాలురకు ప్రత్యక్షదేవుడవు. 'ముర' అనే రాక్షసుని సంహరించినవాడవు. ఈ లోకవ్యవహారంలో నేనెదుర్కొంటున్న ఆపదలనుండి కాపాడు. నీవు అసమానుడివి. నాశనం లేనివాడివి. శ్రీ+ఈశ= శ్రీశ అన్నది మకుటం. శ్రీ అంటే లక్ష్మి. లక్ష్మికి ఈశుడు విష్ణువు. ఈ శతకం వైష్ణవశతకవర్గంలో చేరదగింది.

క॥ చక్రంబు నియోగించియు
నక్రమ్ము వధించినావు నాగముకొఱకై
అక్రూరు cబ్రోచినా విల
శక్రార్చిత! జనుల గావు సరగున శ్రీశా! 8

తాత్పర్యము : శ్రీశా! ఒక పెద్ద మడుగులో పెనుబలం కలిగిన ఒక గజరాజు మొసలివాతబడి దీనాతిదీనంగా రోదిస్తూ మొఱబెట్టుకొన్నవేళ, శరణు శరణని నిన్ను ఆశ్రయించినవేళ ఆ ఏనుగురాజుప్రార్థన ఆలకించి రక్షించావు. మొసలిపీడ వదలించావు. అంతేకాదు అక్రూరునికి రక్షకుడవయ్యావు. దేవేంద్రునిచే పూజింపబడే స్వామీ! కలియుగంలో రకరకాల బాధలతో, కష్టాలతో క్రుంగి కృశిస్తున్న జనులను వెంటనే కాపాడుమయ్యా!

క॥ పన్నగశాయి! పరాత్పర!
నన్నుం గృపcజూడుమయ్య నారాయణ!
పన్నుల పాలిటి దైవమ!
కన్నయ్యా! కమలనయన! కావుము శ్రీశా! 9

తాత్పర్యము : శ్రీశా! ఆదిశేషునిపై శయనించివున్న స్వామీ! పరాత్పరా! నన్ను దయతో చూడు. ఓ నారాయణా! ఆపదలెదుర్కొంటున్న వానిని ఆదుకొనే దైవమా! కృష్ణా! పద్మాలవంటి సొగసైన కన్నులు కలవాడా! రక్షించు.

క॥ కనకాంబరధర! శ్రీహరీ!
వనమాలీ! సర్వలోకవందితచరణా!
ఘననీలమేఘశ్యామా!
దనుజాంతక! మమ్ముఁ జూడు దయతో శ్రీశా! 10

తాత్పర్యము : శ్రీశా! పట్టుపీతాంబరం ధరించినవాడా! లక్ష్మీపతీ! పాదాల దాకా వేలాడే పుష్పమాలికలు కలవాడా! అన్ని లోకాలవారిచే నమస్కరింపబడిన చరణాలు కలవాడా! మేఘంలాంటి నల్లని మేను కలవాడా! రాక్షసులను అంతం చేసినవాడా! మమ్ము దయతో చూడు.

క॥ కమలభవ వాసవాదిగ
నమరులచే పూజలందు అంబుజనాభా!
కమలముఖపద్మ షట్పద!
విమలాంతఃకరణ! మమ్ము వీడకు శ్రీశా! 11

తాత్పర్యము : శ్రీశా! బ్రహ్మ, ఇంద్ర మున్నగు దేవతలచే పూజలందుకొనే స్వామీ! పద్మనాభా! లక్ష్మీదేవియొక్క పద్మంలాంటి ముఖంపై వాలిన తుమ్మెదలాంటివాడా! మాలిన్యరహితమైన అంతఃకరణం కలవాడా! మమ్మల్ని ఎప్పుడూ వదలిపెట్టవద్దు.

క॥ నారాయణ! జగదీశ్వర!
నారాయణ! వాసుదేవ! నందుని తనయా
నారాయణ! శ్రీవల్లభ!
నారాయణ! మమ్ము గావు నగధర! శ్రీశా! 12

తాత్పర్యము : శ్రీశా! విష్ణునామావళిలో 'నారాయణ' శబ్దమొకటి. ఈ శబ్దానికి చాల అర్థాలున్నాయి. అవతారాలలో నరశరీరము పొందువాడు, నారము అనగా జలము. జలము అధిష్ఠానముగా కలవాడు, నరసమూహమునకు స్థానమైనవాడు. శబ్దగమ్యుడు అని ఈ పద్యంలోని

'నారాయణ' శబ్దం నాలుగుసార్లు ఆవృత్తి అయినది. చతుర్విధ పురుషార్థములను ప్రసాదించువాడని విశేషార్థం. వాసుదేవ శబ్దానికి వసుదేవుని కుమారుడని ఒక అర్థం. అన్ని జగములు తనయందు గల దేవుడు అని మరొక అర్థం. జగమునంతట ఉండే దేవుడని అర్థం. నందుని కుమారా! లక్ష్మీదేవికి ప్రియం కలిగించేవాడా! గోవర్ధనపర్వతాన్ని ఎత్తినవాడా! మమ్ములను కావుము.

కః శ్రీలలనామణితోడుగ
పాలకడలి శేషునిపైన పవళించితివే
జాలము సేయక శ్రీధర
పాలింపుము మమ్ము వేగ పావన శ్రీశా! 13

తాత్పర్యము : శ్రీశా! సకలకళావిలాసిని (విలాసాత్మక అయిన) లక్ష్మీదేవి తోడుకాగా, క్షీరసముద్రంలో ఆదిశేషునిపైన శయనించినవాడవే! ఇక ఏమాత్రమూ ఆలస్యం చేయక శ్రీధరా! పావనమూర్తీ! వేగ మమ్మల్ని పాలించవయ్యా!

విశేషము : విలాసాలతో కూడిన స్త్రీని 'లలన' అంటారు. లక్ష్మీదేవి విలాసాలు అనంతం. రకరకాల సంపదలన్నీ ఆ తల్లి విలాసాలే. ఆ తల్లి కృపవలన ఇహలోకంలో మానవాళికి అబ్బే పదవులు, రూపం, సుఖసంతోషాదులు అన్నీ విలాసాలే.

కః ఆదిని వేదము కావగ
మేదిని మీనావతార మెత్తితివయ్యా
ఈ ధరణి కావగా మరి
భూదారమవైతివయ్య భువిలో శ్రీశా! 14

తాత్పర్యము : శ్రీశా! సోమకాసురుడు వేదాలను అపహరించగా నీవు రాక్షససంహారార్థమూ, వేదరక్షణార్థమూ మత్స్యావతారమెత్తావు. అంతేకాదు

హిరణ్యాక్షుడు ధరణిని పీడించగా ఆ ధరణి బాధలతీర్చి ఆ భూకాంతకు మగడవయ్యావు.

కII దితిసుతులు యదితిసుతులుం
జతగా పాల్కడలి జిల్క యమృతముకొరకై
అతిభారనగమునెత్తగ
చతురత కూర్మంబువైతి వంతట శ్రీశా! 15

తాత్పర్యము : శ్రీశా! రాక్షసులు, దేవతలు అమృతంకోసం కలిసి మంధర పర్వతం చిలికేవేళ ఆ పర్వతం క్రుంగకుండా నీవు కూర్మావతారమెత్తినావు.

కII వరప్రహ్లాదుని కావగ
నరసింహుడవైతివయ్య నారాయణుడా
ధర యాహిరణ్యకశిపుని
బరిమార్చితివయ్య పతితపావన! శ్రీశా! 16

తాత్పర్యము : శ్రీశా! భక్తవరేణ్యుడైన ప్రహ్లాదుని కాపాడడంకోసం నారసింహుడవైనావు. నారాయణుడవైన నీవు ప్రహ్లాదసంరక్షణార్థం హిరణ్యకశిపుని సంహరించావు. నీవు పతితులను పావనులుగా చేసే దయాస్వరూపుడవు.

కII పక్షికులాధిపవాహన!
రక్షోవిభుడైన బలిని రంజింపంగా
భిక్షము మూడడుగుల నిల
లక్షణముగ గోరినావు రక్షక! శ్రీశా! 17

తాత్పర్యము : శ్రీశా! పక్షికులానికి అధిపతైన గరుత్మంతుని వాహనంగా కలవాడా! రాక్షసాధిపతియైన బలిని రంజింపజేయడానికోసం మూడడుగుల భూదానమును కోరినావు.

కII ఇరువదొకమారు దిరియు
పరశువు చేబూని పరశురాముడవై యా
నరపతుల గూల్చినాడవు
వరదాయక! మమ్ము విడకు వసుధన్శ్రీశా! 18

తాత్పర్యము : శ్రీశా! వరాలను ప్రసాదించే కరుణామూర్తీ! గర్విష్ఠులయిన ఇతరులను లెక్కచెయ్యనివారైన నరపతులను వెదకి వెదకి 21 మార్లు అన్వేషించి వారిని సంహరించావు. స్వామీ! నీవు ఈ లోకంలో మమ్మల్ని విడువవద్దు. సదా రక్షించు.

కII జనకుని పనుపున కానకు
అనుజుండా లక్ష్మణుండు యవనీసుత వెం
టను రాగ నేగినాడవు
వనమాలీ జగతి కావు వదలక శ్రీశా! 19

తాత్పర్యము : వనమాలీ! తండ్రి ఆనతిమేరకు శ్రీరాముడవైన నీవు కాననవాసానికి సిద్ధుడవై సీతమ్మతో కదలిన వేళ తమ్ముడైన లక్ష్మణుడును నిన్ను అనుసరించినాడు. ముల్లోకాలను కాపాడవయ్యా!

విశేషము : జనయతీతి జనకః – సంతానకారకుడు జనకుడు.
అనుపశ్చాత్ జాతః అనుజః – వెనుక బుట్టినవాడు. తమ్ముడని అర్థం.
అవతి ప్రజాః – ప్రజలను రక్షించునది అని అమరం.

కII వెన్నలు పాలుం గ్రోలుచు
చిన్నతనంబునను చిలిపి చేష్టలు చేయన్
కన్నెలు గోపికలందరు
నిన్నే నిందించినారు నిజమది శ్రీశా! 20

తాత్పర్యము : శ్రీశా! నీవు కృష్ణావతారంలో రేపల్లెలో బాలుడవైన వేళ స్నేహితులతో కూడి వెన్న, పాలకు ఆశపడి చిలిపిచేష్టలు చేశావు. ఆ చేతలకు గోపికలు నిన్నే నిజంగా నిందించినారు. ఇది నీ లీలావిలాసం. ఇది నిజం కాదా!

క॥ ఇద్ధరను కావగా మరి
శుద్ధోధనపట్టివయ్యు సురుచిరలీలన్
బుద్ధుడవైతివి దేవా
పద్ధతులను దెల్పినావు పొందిత శ్రీశా! 21

తాత్పర్యము : శ్రీశా! శుద్ధోధనునికి కుమారుడివి, రాజవంశీయుడవు. అయినా లోకాలను ఉద్ధరించదలచుకొన్నావు. రాజవేషాన్ని తృణప్రాయంగా త్యజించావు. సన్యాసివి అయ్యావు. సత్యాన్వేషణకోసం సర్వస్వం వదలి సత్యం తెలుసుకొని బుద్ధుడవయ్యావు. లోకులు ఎలా నడవాలో తెలిపావు. పామరులకు తెలియజెప్పే విధానంతో, ప్రబోధనలతో ప్రసిద్ధుడవయ్యావు.

ఈ పద్యంలోని బుద్ధుడు పురాణాలలో ప్రఖ్యాతుడైన బుద్ధుడు కాదు. కాని బుద్ధం – ధర్మం అహింసాదుల భూమికానేపథ్యంలో పుట్టినమతం. ఏదైనా మానవత్వానికి పెద్దపీట వేసిన మతం.

క॥ కలియుగమందున ధరలో
వెలయుము కల్క్యవతారమేర్పడగాగన్
జలజాక్ష దుర్జనావళి
బలమును ఛేదించి జగతి గావుము శ్రీశా! 22

తాత్పర్యము : శ్రీశా! దశావతారాలలో చివరిది కల్క్యవతారం. స్వామి కలియుగంలో నీవు కల్కివిగా అవతరించు. జలజాక్షా! ఈ కలియుగంలో విజృంభిస్తున్న దుర్జనులను, దుష్టుల బలమును ఛేదించి జగాలను కాపాడుము.

క॥ కంజదళనేత్ర! మీపద
కంజాతములందు మనము కల్గింటినయా
అంజలి ఘటించినాడను
కుంజరవరదాత! మమ్ము గావుము శ్రీశా! 23

తాత్పర్యము : శ్రీశా! స్వామీ! పద్మదళములవంటి కన్నులు కలవాడవు. అంతేకాదు నీ పదములు పద్మాలవంటివే. అలాంటి పాదాలపై మనసు నిలిపినాను. ఆ దివ్యపాదాలకు చేతులు జోడించాను. ఆపదలో మొఱపెట్టిన ఏనుగుకోరిన బంధనావిముక్తి వరమును ప్రసాదించినవాడవయ్యా! ఇహబంధాల విముక్తికోసం మమ్ము కాపాడుము.

క॥ నిర్జరుల పాలిటి పెన్నిధి
దుర్జన వనకేలి సకలదురితంబులు నీ
పజ్జను చేరిన తొలగును
సజ్జన పరిపాల! నీవె శరణము శ్రీశా! 24

తాత్పర్యము : శ్రీశా! సత్పురుషులను పరిపాలించేవాడా! నీవు దేవతలకు పెన్నిధివి. దుర్జనుల సహవాసం కారణంగా అన్ని రకాల పాపకృత్యాలు చేసినా నీ చెంత చేరితే అవన్నీ తొలగిపోతాయి.

ఆపదలు వచ్చిన వేళల్లో దేవతలందరు నీ దగ్గర మొఱపెట్టినవారే. వారికి నీవు తరగని పెద్దనిధిలాంటివాడవు. దుర్మార్గుల సహవాసము నుండి విముక్తుడనై నీ పక్క చేరితే శరణాగతి చేస్తే ఆ పాపసమూహమంతా పటాపంచలవుతాయి. 'జరా' అంటే ముసలితనం. ఈ ముసలితనం దేవతలకు లేదు. కనుక వారు నిర్జరులు.

క॥ మాతవలె నేగుదెంచిన
పూతనను వధించినావు పురుషోత్తమ! యా
భూతము మడియగ కంసుని
చేతమునన్ భీతియపుడె చెలగెను శ్రీశా! 25

తాత్పర్యము : శ్రీశా! పురుషులలో ఉత్తముడవైన కృష్ణా! నీవు రేపల్లెలో పసిబాలుడవుగా ఉండగా పాలు కుడిపించే నెపంతో పూతన తల్లిలా వచ్చింది. ఆమె కంసుని ప్రేరణవల్ల వచ్చిందని నీవు పసిగట్టావు. ఎపుడైతే నీవు పూతనను వధించావో ఆనాడే తనకూ మరణం తప్పదని కంసుని మనసులో భయం పుట్టింది.

క॥ వర కాళీయుని తలపై
అరయంగా నాట్యమాడి యలరించితివే
కరుణాంతరంగ! శ్రీధర!
ధరలో విశ్వమును గావు, దయతో శ్రీశా! 26

తాత్పర్యము : శ్రీశా! గోవుల్ని, గోపాలకుల్ని, రేపల్లె బృందావనవాసుల్ని పీడించే కాళీయసర్పం పడగలపై అలవోకగా నాట్యవిన్యాసాలు ప్రదర్శిస్తూ అందరిని అలరించావు కదా! నీవు దయాహృదయుడవు. శ్రీధరుడవు. దుర్మార్గులు ప్రబలిన ఈ లోకంలో, సజ్జనులకు విశ్వాసం కలిగించేలా ఈ విశ్వాన్ని రక్షింపవయా!

క॥ పేదయగు నా కుచేలుని
యాదరమున జూచి యర్ఘ్యపాద్యములిడి తా
మోదమున యటుకులం దిని
సాదరమున నొసగినావు సంపద శ్రీశా! 27

తాత్పర్యము : శ్రీశా! బాల్యస్నేహితుడు, సహాధ్యాయి అయిన కుచేలుడు తన మిత్రుడగు శ్రీకృష్ణుని కడకు రాగా, అతనిని ఆదరంతో చూడడమేగాక సముచిత మర్యాదలు చేసి అతడు తెచ్చిన, ఇవ్వడానికి సంకోచిస్తున్న అటుకులు అందుకొని సాదరంతో నోటవేసుకొని అతనికి సంపద లనుగ్రహించావు.

విశేషము : ఈ పద్యంలోని 'అర్ఘ్యం' అనుమాటకు పూజార్థమైన జలాదులని అర్థం. పాద్యమంటే పాదాలు కడుగుకోవడానికి ఇచ్చే జలం.

కII హే వాసుదేవ! మురహరి!
నీ వా శకటాసురుని లీల నిర్జించితివే
దేవా! దానవులన్మరి
శ్రీవర! దున్మితివె, పిన్నవయసున శ్రీశా! 28

తాత్పర్యము : శ్రీశా! వసుదేవుని కుమారుడా! మురుడను రాక్షసుని సంహరించినవాడా! నిన్ను హతం చేయాలని వచ్చిన శకటరూపదానవుని జీవరహితుణ్ణి చేశావు. అంతేకాదు బాల్యదశలో వత్సాసుర, శకటాసుర, ధేనుకాసురాది, ఎందరో దానవులను సంహరించితివి. పిన్ననాట దుర్మార్గులైన రాక్షసులను చంపడం సామాన్యం కాదు. అవతారపురుషునికే సాధ్యం. వారందరు నీ కీడును కోరినవారే.

కII తల్లియె రోలను గట్టగ
మెల్లన ఈడ్చుకొని మద్దిచెట్లను గూల్చన్
అల్లన గంధర్వులుగా మరి
ఎల్లరు యబ్బురమునంద నేగిరి శ్రీశా! 29

తాత్పర్యము : శ్రీశా! తల్లి చిన్నికృష్ణుని చిలిపిచేతలకు తట్టుకోలేక, అల్లరి మానేలా రోటికి కట్టిపడవేసింది. తన పనులలో తాను మునిగింది. కాని కృష్ణుడు రోలను కదిలించుకొంటూ వెళ్ళి మద్దిచెట్లమధ్య లాక్కొనిపోయాడు. కృష్ణుని పాదారవిందస్పర్శతో గంధర్వజాతికి చెందిన నలకూబర మణిగ్రీవులకు శాపవిముక్తి కలుగగా ఆ రెండు మద్దిచెట్లు మూలం పెల్లగిలి కొమ్మలు విరుగ నేలకూలాయి.

కII సప్తగిరివాస! శ్రీహరి!
సప్తోదధులావలున్న సద్భక్తులకుం
దృప్తిగ నీ రూపము గన
ఆప్తుడవై గానుపింతు వచ్యుత! శ్రీశా! 30

తాత్పర్యము : శ్రీశా! ఏడుకొండలమీద నెలకొన్న స్వామీ! శ్రీహరిస్వరూపుడా! ఏడు సముద్రాల ఆవలున్న నీ భక్తులకు నీ దర్శనభాగ్యం కల్పిస్తూ వారికి దగ్గరివాడవైయున్నావు కదా!

విశేషము : శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలో వర్ణిత పర్వతాలు శ్రీపర్వత, శేషాచల, గరుడాచల, నారాయణాచల, వృషభాచల, వేంకటాద్రి, వృషాద్రి. ఇవి ఏడుకొండలు. వృషమంటే ధర్మం. ధర్మదేవత తన స్వాభివృద్ధికోసం తపస్సుచేసే చోటు కనుక వృషాద్రి అనిపేరు. తిరుమలకు ఇవేగాక 20 పేర్లున్నాయి. సప్త ఉదధులలో కొన్ని క్షీరసముద్రం, లవణసముద్రం, దధిసముద్రాదులు.

కII శ్రీధర! కేశవ! మాధవ!
సాదరముగ భక్తజనుల సతతము గాచున్
మీ దయను గొన్నవారికి
భూధరధర! ముక్తిపథము జూపెదు శ్రీశా! 31

తాత్పర్యము : శ్రీశా! శ్రీధరుడివి! కేశవనామాంకితుడివి, మాధవుడివి. నీ నామసంకీర్తన చేసే భక్తజనులను ఎల్లవేళల కాపాడెడివాడవు. పాతాళమునకు క్రుంగిన భూమిని లేవనెత్తినవాడా! మీ కృప కలిగితే భక్తులకు ముక్తిపథదర్శనం చేస్తావు.

విశేషము : చతుర్విధపురుషార్థాలలో ముక్తి నాల్గవది. సకలజంతుకోటికి చివరి గమ్యం అదే. ఆ ముక్తిపథం అందరికి దర్శనీయం కాదు. భగవత్ కటాక్షం గలవారికే సుసాధ్యం.

కII కుండలి తల్పం బాయెను
అండజవాహనము నీకు నమరెను మేనం
మండనములు మెరయగ యా
ఖండలనుత! నిన్ను గనగ వశమే శ్రీశా! 32

తాత్పర్యము : శ్రీశా! కుండలాకారం కలది కుండలి. అనగా ఆదిశేషసర్పం. ఈ సర్పమే విష్ణువుకు తల్పమయింది (పానుపయింది) గరుత్మంతుడు వాహనమాయెను. దేవేంద్రునిచే పొగడబడెడివాడా! సర్వాలంకార భూషితుడవైన స్వామీ! నీ రూపం తనివితీర చూడ నాలాంటివానికి సాధ్యమా!

విశేషము : ఆఖండలుడు అంటే శత్రువులను ఖండించినవాడు. అరీన్ ఖినత్తీతి ఆఖండలః అమరం.

క॥ సుందరరూపుడ! కృష్ణా!
అందెలు, గజ్జెలును దాల్చి యానందముతో
చిందులు వేయగ, నిను గన
నంద, యశోదలకు, నేత్రపర్వమె శ్రీశా! 33

తాత్పర్యము : శ్రీశా! సుందరాకారా! కృష్ణా! అందియలు, గజ్జియలు ధరించిన నీవు చిందులు వేస్తుంటే ఆ చిందులను, అప్పటి నీ సుందరాకారాన్ని చూచే నందునికి, యశోదకు కళ్ళకు విందే కదా!

విశేషము : మిక్కిలి సంతోషపెట్టేది సుందరం. అలాగే స్వయం కరోతీతి కృష్ణః అన్నిటిని చేయువాడు కృష్ణుడు. దైత్యులను నలిపివేయువాడు, చిత్తము ఆకర్షించువాడు. పోతన 'అనుదిన సంతోషణములు సుతుల క్రీడా వినోదాల'న్నాడు.

క॥ భక్తిగ మిము సేవించిన
ముక్తి నొసగి గాతువయ్య మునిజనవంద్యా!
యుక్తమె మీరిటు సేయుట
భక్తాళికి మీకునెపుడు బంధమె శ్రీశా! 34

తాత్పర్యము : శ్రీశా! ఎవరైతే నిన్ను నిజమైన భక్తితో సేవిస్తారో అలాంటివారికి నీవు తప్పక ముక్తిని ప్రసాదించి కాపాడుతావు. ఇది

ముమ్మాటికి సత్యం. ఇది భక్తాళికి భగవంతునికి మధ్యగల బంధమే అనుబంధమే.

భగవంతుడు భక్తులను పరీక్షించినా వారిని వదులుకోడు. భాగవతవిరహాన్ని భరించలేడు. అలాగే భక్తుల పరాచికాల్ని స్వామి తక్కువగా లెక్కవేయడు. అన్నీ తెలిసిన అర్జునుడు కృష్ణుని 'యాదవా' అని హేళనగా సంబోధించిన నవ్వి ఊరకున్నాడు అనడం ఒక ఉదాహరణ.

క॥ ధర్మము నెలకొను తావున
నిర్మల మనమున్న జనుల నీతికి నెలవై
కర్మలను జేయు జనముల
మర్మము విడనాడి యుందు వచ్యుత! శ్రీశా! 35

తాత్పర్యము : శ్రీశా! నాశనం లేనివాడవు. ధర్మం ఎక్కడవుందో, మాలిన్యరహితమైన జనులెచట వసిస్తారో, నీతికి నెలవైన చోట్లేవో విధ్యుక్తకర్మలను ఆచరించేవారిపట్ల మర్మం లేక వసిస్తావు.

క॥ వైదర్భి వాంఛితమ్మును
సాదరముగ నాదరించి సాయము జేయన్
సోదరుడు రుక్మిమదమును
ఛేదించియు, రుక్మిణమ్మ చేగొని శ్రీశా! 36

తాత్పర్యము : శ్రీశా! విదర్భాధిపతి భీష్మకుడు. అతని కుమార్తె వైదర్భి రుక్మిణి. ఆమెకేమో శ్రీయుతాకారుడు, మానినీచిత్తచోరుడు అయిన కృష్ణుని పతిగా వరించాలని కోరిక. కాని సోదరుడు రుక్మిణిని శిశుపాలునకిచ్చి స్నేహబంధాన్ని పెంచుకోవాలని ప్రగాఢకాంక్ష. కాని రుక్మిణి మానసిక నిర్ణయాన్ని సాదరంగా ఆదరించి కృష్ణుడు రుక్మిణినే వరించాలనుకొన్నాడు. ఇందుకు అడ్డంగా వున్న రుక్మిమదాన్ని ఛేదించాడు. గర్వభంగం చేశాడు. తదనంతరం ప్రతాపమే ఉంకువగా చేసి పెళ్ళాడినాడు.

కః నీరజనయన ముకుందా
నీరద ఘనశ్యామ నిఖిల జగదాధారా
వర నిగమాంతవిహారా
పరమార్థంబైన మీరె పావన! శ్రీశా! 37

తాత్పర్యము : శ్రీశా! స్వామీ! పద్మనయనంబులవాడవు నీవే. ముక్తిప్రదాతవు నీవే. నల్లని మేఘాల వర్ణం కలవాడవు నీవే. సమస్తలోకాలకు ఆధార భూతుడవు నీవే. సర్వశ్రేష్ఠమైన వేద, వేదాంతములలో విహరించేవాడవు నీవే. పరమాత్మవు నీవే. పావనుడవు నీవే.

కః పాణిని వెన్నయుఁ బట్టియు
వేణిని పింఛము ధరించు వేదవిహారా!
రాణించినావు కృష్ణా!
వేణుగానమ్ము మీకు వేడుకె శ్రీశా! 38

తాత్పర్యము : శ్రీశా! స్వామీ! అన్నీ నీకు వేడుకలే. చేతవెన్నపట్టడం ఒక కేళి. తలపై నెమలిపింఛము ధరించడము ఒక సౌందర్యవిలాసం. వేదాలలో విహరించడం నీకు సహజస్వభావం. అన్నిటికన్నా నీవు వేణుగానంతో బృందావనాన్ని, గోపికాశ్రేణిని, ఆలమందను, ప్రకృతిని రంజించడమూ నీకే వేడుక.

కః లలనలు యమునావారిని
జలకంబు లొనర్పనుంచి తటమున వల్వల్
జలజాక్ష! ప్రుచ్చిలించితె
ఇల నీవిటు సేయుటెల్ల నీతియ శ్రీశా! 39

తాత్పర్యము : శ్రీశా! విలాసినులు యమునాజలంలో హాయిగా తానమాడాలని ఒడ్డున తమతమ వస్త్రాలుంచితే వాటిని దొంగలించావు. ఇలా చేయడం నీతి అనిపించుకుంటుందా! ఇలాంటివి నీ బాల్యక్రీడలు సామాన్యులకు అర్థంగానివి.

కII నీతియు ధర్మము నిల్పగ
భూతల మవతారములను భూరిగ దాల్చెన్
చేతము తోడుత శ్రీహరి
పాతకముల, పారఁద్రోలినాడవె శ్రీశా! 40

తాత్పర్యము : శ్రీశా! ధర్మసంస్థాపనార్థం నీవు భూలోకంలో ఎన్నో అవతారాలెత్తావు. అవన్నీ మనసా చేసినవే. అంతేకాదు దుష్టుల, దుర్మార్గుల, పాపాత్ములను పారద్రోలినావు.

భాగవతం ప్రకారం విష్ణువు అవతారాలు ఏకవింశతి అయిన సుప్రసిద్ధాలు దశావతారాలు. అన్ని అవతారాలలోని పరమార్థం దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన, నీతిస్థాపన, భగవంతుడు రక్షకుడనే భావన కలిగించడమే.

కII నందయశోదల తనయా!
బృందావన వనవిహార! భూవర! దేవా!
సందేహమేల మునిగణ
వందిత జగమెల్లఁ గావ రావా శ్రీశా! 41

తాత్పర్యము : శ్రీశా! నందునికి యశోదకు కుమారుడైనవాడా! బృందావనంలో విహరించేవాడా! భూవరా! దేవా! మునిగణాలతో స్తుతింపబడేవాడా! లోకాలను కావ రావా! ఇందుకు సంశయమేల!

కII శ్రీరమణ! భక్తపాలన!
వారక నీ దర్శనంబు వాంఛించితి, నో
కరుణాత్మ! కనగదమ్మా!
మారజనక! మమ్ముఁ గావు మహిలో శ్రీశా! 42

తాత్పర్యము : శ్రీశా! గీతకళాదులు నేర్చి రమించే లక్ష్మితో కూడినవాడా! భక్తులను పాలించేవాడా! స్వామి నీ దర్శనం కోరుతున్నాను.

కరుణాహృదయా! కనులార దర్శించ కదలి రావయ్యా! మన్మథునికి తండ్రి అయినవాడా! ఈ లోకంలో మమ్మల్ని కాపాడుమయ్యా!

కII వైకుంఠపురనివాసా!
సకలార్థము లొసగు దేవ! సంకర్షణ! యో
అకలంక! భక్తితోడను
సకలాత్మక! నిన్ను గొల్తు సతతము శ్రీశా! 43

తాత్పర్యము : వైకుంఠంలో నివసించేవాడా! భక్తులు కోరేవన్నీ ప్రసాదించేవాడా! సంకర్షణ నామధేయా! కళంకములేనివాడా! సకలాత్మకా! భక్తితో నిన్ను సేవిస్తాను. సంకర్షణశబ్దానికి శత్రువుల్ని లేక ప్రళయకాలంలో సర్వజనులను సంహరించేవాడని 'అమరం'.

కII భక్తజనపాల! శ్రీకర!
ముక్తిని గల్గించు దేవ! మురహర! శౌరీ!
నక్తంచరగణభీకర!
యుక్తంబగు శిక్షవేతు వుర్విని శ్రీశా! 44

తాత్పర్యము : శ్రీశా! భక్తజనులను పాలించువాడా! సమస్త మంగళములను ప్రసాదించువాడా! ముక్తిని ప్రసాదించువాడా! మురుడనే రాక్షసుని హరించినవాడా! శూరుడనగా వసుదేవుని తండ్రి. అతని మనుమడు. రాత్రివేళల్లో యథేచ్ఛగా సంచారం చేసే రాక్షసగణానికి భీకరమైనవాడా! వారికి తగిన శిక్షను వేసేవాడవు నీవే కదా!

కII దేవకీదేవితనూజా!
శ్రీవర, గోవింద! శౌరి! శ్రీవత్సాంకా!
కావగ రావా మాధవ!
నావల్లను దోసమేమి నమ్మితి శ్రీశా! 45

తాత్పర్యము : శ్రీశా! దేవకీదేవి కుమారా! శ్రీవరా! గోవిందా! శౌరీ! శ్రీవత్స చిహ్నితుడా! మాధవా! నాలో ఏ దోషముంది. నేను నీవాడను. నిన్ను నమ్మినవాడను. నన్ను కాపాడుము. వక్షఃస్థలమందు మహాపురుషలక్షణమైన శ్రీవత్సమనెడి గురుతు గలవాడా!

కు॥ రేపల్లె గోపికలు మరి
కోపంబున నిన్ను బట్టు కోరికయుండన్
దాపున నున్నను దొరకవు
బాపురె! నీ మాయకాదె బాంధవ! శ్రీశా! 46

తాత్పర్యము : శ్రీశా! నీవు మాయామానుషవిగ్రహుడవు. నీ మాయలనంతం. రేపల్లె నీ నివాసం. గోపికలు నీ వారు. వారిని ఏడిపిస్తావు. కరుణిస్తావు. ఆటపట్టిస్తావు. ఆ సందర్భంలో గోపికలు ఎలాగైనా నిన్ను పట్టుకోవాలని అనుకొంటారు. దగ్గరున్నా వారికి పట్టువడవు. ఇదంతా నీ మాయకాదా! నీవు అందరికి బాంధవుడవే. అనురాగబంధం విడదీయరానిది. ఆ బంధం తియ్యనిది. భక్తజనులకు నీవు సదా బాంధవుడవే.

కు॥ దీపముగా బుట్టించిన
నీపయి చిరువెల్గు చిమ్మియుందును దేవా!
నీ పదపీఠంబైనను
శ్రీపతి నిను మోయుచుందును శ్రీవర! శ్రీశా! 47

తాత్పర్యము : శ్రీశా! నా కోరికను విను. నన్ను దీపంగా పుట్టించు. నీ గర్భాలయంలో నీపై చిరువెలుగులు చిమ్ముతాను. లేదా స్వామీ నీ పదపీఠంగా పుట్టించు. శ్రీపతి నిన్ను మోస్తుంటాను. ఈ భాగ్యాలు నాకు ప్రసాదించు.

ఈ శతకంలో ఆణిముత్యంలాంటిది ఈ పద్యం. భక్తుడు భగవత్సామీప్యాన్ని ఎపుడూ కోరుతుంటాడు. కులశేఖరాళ్వార్ ఎన్నోరకాల

ప్రార్థించి చివరకు గడపగా ఉండాలనే కోరుకొన్నాడు. కాని ఈ కవి దీపంగా, పాదపీఠంగా కోరడం బాగుంది.

క॥ హే వసుదేవతనూజా!
కావుము తన మానమనుచు కామిని వేడన్
శ్రీవర! యక్షయముగ, నీ
వా వల్వలొసంగినావు వారక శ్రీశా! 48

తాత్పర్యము : వసుదేవుని కుమారా! గోపికలు యమునలో తానమాడారు. ఆపై తీరంలో పెట్టిన వస్త్రాలకోసం ఇటు అటూ చూశారు. కాని ఆ వస్త్రాలను నీవే హరించినావని తెలిసి దైన్యంగా వేడారు. వారి ప్రార్థనలను ఆలకించి నీవు అక్షయవస్త్రాలు ఇచ్చావు. వస్త్రాలు కాదు వరాలిచ్చాడని భావం. 'కామోత్కంఠత గోపికల్' కృష్ణభక్తిని ప్రదర్శించినారు.

క॥ మన్నుదినగ మీ యన్నయె
విన్నవించె తల్లి కదియు వివరముగా, తా
చిన్నదగు నోట, మాతకు
ఎన్నగ లోకాలు జూపితేలనొ శ్రీశా! 49

తాత్పర్యము : శ్రీశా! నీవు మన్ను దిన్నావని మీ అన్న బలరాముడు తల్లికి ఫిర్యాదు చేశాడు. తల్లి గాభరాపడింది. కుమారుని పిలిచింది. రెట్టబట్టుకొని నోరు తెరవమంది. మన్ను తిన్న ఛాయలు కనిపించలేదు. సకలలోకాలు కనిపించాయి. మరి ఇందుకు కారణమేమిటో?

క॥ సాత్రాజితి రుక్మిణియున్
మిత్రవింద జాంబవతియు లక్షణ భద్రన్
చిత్రమిదె నాగ్నజితియున్
ఆత్రము కాళింది మీకు దైతలె శ్రీశా! 50

తాత్పర్యము : కృష్ణా! నీవు అష్టమహిషులను వివాహమాడినావని భాగవతం చెబుతుంది. వారు సాత్రాజితి (సత్రాజిత్తు కుమార్తె) రుక్మిణి, మిత్రవింద, జాంబవతి, లక్షణ, భద్ర, నాగ్నజితి, కాళింది వీరందరు నీ మది మెచ్చినవారు. వీరి వృత్తాంతం భాగవతం దశమస్కంధంలో వర్ణితం.

తెలుగు సాహిత్యంలో 'అష్టమహిషీకల్యాణం, రాజగోపాలవిలాసం' అనే రెండు గ్రంథాలు అష్టమహిషుల గూర్చి విశదం చేసేవి.

క॥ ఉదరమునందు యజాండము
పదిలముగా నిల్పినట్టి పరమాత్మ! హరీ!
కుదురుగ దేవకి కుక్షి నీ
సదయుడ వెట్లుంటివయ్య, సద్గురు శ్రీశా! 51

తాత్పర్యము : శ్రీశా! స్వామీ! నీ పొట్టలో బ్రహ్మాండమంతా పదిలంగా నిలిపినావు. అలాంటి పరమాత్ముడవైన నీవు దేవకికడుపులో ఎలా ఉన్నావయ్యా? నీవు దేవకిని కటాక్షించడానికే ఆమె ఉదరంలో ఉన్నావు. నీవు గురుడవు. కనుకనే 'కృష్ణం వందే జగద్గురుమ్' అన్నారు.

క॥ వరమిడిన శర్వుపైనే
వరమహిమం దెలియ భవుని వెంటాడగ, శ్రీ
ధర! మోహిని రూపమునన్
బరిమార్చితివయ్య భస్మదానవు! శ్రీశా! 52

తాత్పర్యము : శ్రీశా! భస్మాసురుడు తపశ్శక్తిచే శివుని మెప్పించినాడు. భోళాశంకరుడైన ఆ శివుడు భక్తుడు కోరిన వరం ప్రసాదించాడు. అయినా భస్మాసురుడు సంశయాత్మకుడై తనకిచ్చిన వరం సఫలమౌతుందా అని పరీక్షించదలచుకొన్నాడు. చివరకు భవుని తలపై తన హస్తం పెట్టదలచినాడు. శివుడు వెనువెంటనే పలాయనమంత్రం పఠించాడు. భస్మాసురుడు శివుని వెంటబడ్డాడు. ఇలాంటి విపత్కరపరిస్థితిలో విష్ణువు

మోహినీ అవతారమెత్తి భస్మాసురుని కవ్వించాడు. తానూ వెన్నునిలా నాట్యమాడసాగాడు. ఒకసారి మోహిని తన హస్తాన్ని తలమీదనుంచి అభినయవిశేషాన్ని ప్రకటిస్తుంటే భస్మాసురుడు అలాగే అనుకరించేసరికి తానే బూడిద అయినాడు. ప్రళయకాలమందు భూతములను హింసించువాడు శర్వుడు. 'భస్మదానవు' అనడంలో భస్మాసుర నామాంకితుడైన దానవుడని కవి అభిప్రాయం.

క॥ శతమన్యు నెదుర్కొనియుం
జతురత యా పారిజాతతర్వుం గొని, తా
సతియగు సాత్రాజితికిం
శ్రితజనవత్సలత నొసగినాడవు శ్రీశా! 53

తాత్పర్యము : శ్రీశా! నూరుయాగాలు చేసిన, త్రిలోకాధిపతియైన దేవేంద్రునితో చాకచక్యంగా ఎదుర్కొని పారిజాతతరువును పెకలించి భూలోకమునకు తెచ్చి సత్యభామకు ప్రసాదించావు. తన్ను ఆశ్రయించిన వారిపట్ల వాత్సల్యభావం కలవాడవు. ఈ పద్యంలో పారిజాతాపహరణ వృత్తాంతముంది. రుక్మిణికేమో నారదుడిచ్చిన పారిజాతపుష్పమిచ్చాడు. సత్య తన్ను కృష్ణుడు తేలికపరచాడని భావించినవేళ ఒక పుష్పమేమిటి పారిజాతవృక్షాన్నే తెచ్చి ఇస్తానని సముదాయించి తన మాట నిలబెట్టుకొన్నాడు. సత్రాజిత్తు కుమార్తె సాత్రాజితి. ఆమెయే సత్యభామ.

క॥ శివుడున్ధాతయు ఁగూడియు
గోవత్సములట్లు మారి, గోప్యముగానే
శ్రీవర క్షీరమ్మిడుచును
కావగ మిము, వచ్చినారు కాంక్షతో శ్రీశా! 54

తాత్పర్యము : ఇది తిరుమల వేంకటస్వామికి సంబంధించిన వృత్తాంతం. వెన్నుడు లక్ష్మీదేవి వైకుంఠం వదలి అలుకతో వెళ్ళిపోగా తానూ వైకుంఠం వదలి వేంకటగిరి చేరి ఎవరికీ తన మొగం చూపించడం ఇష్టంలేక పుట్టలో

దాగాడు. ఈ వృత్తాంతం తెలిసిన శివుడు, బ్రహ్మ, లక్ష్మిని చేరి ఆకలితో నకనకలాడే స్వామిస్థితిని చెప్పారు. మగని నిస్సహాయతను గుర్తించిన లక్ష్మి తాను గొల్ల అయింది. పశువులు అమ్మేదానిలా బయలుదేరింది. శివచతుర్ముఖులు ఆవుదూడలయ్యారు. గొల్లెత చోళరాణికి ఆ పశువును అమ్మింది. ఆ గోవురక్షణను ఆ రాణి ఒక గొల్లవానికి అప్పగించింది. ఆ ఆవు గొల్లము కళ్ళుగప్పి మందనుండి విడివడి పుట్టదగ్గరచేరి పాలు స్రవించసాగింది. వల్మీకంలోని వెన్నుడు ఆ క్షీరపానంతో తృప్తుడయ్యాడు. ఈ రకంగా ముప్వురి కాంక్షలు తీరాయి.

క॥ మురహర! శార్ఙ్గి! ముకుందా!
మురళీధర! వాసుదేవ! మునిగణవినుతా!
కరివరద! కామజనకా!
సరసిజదళనేత్ర! సుజనపాలక! శ్రీశా! 55

తాత్పర్యము : ఈ పద్యంలో అన్నీ సంబోధనలే. స్థితికారకుడైన మహావిష్ణువు స్తోత్రాలే. ప్రతి సంబోధన వెన్నుని లోకోత్తర గుణాలను ఆకర్షించినవే. శార్ఙ్గం మహావిష్ణువు వింటిపేరు. మన్మథుని తండ్రి అనడానికోసం 'కామజనక' సంబోధన. సుజనులకు స్వామి సదా పాలకుడు.

క॥ వటపత్రశాయి! నీ విల
నటనలు జేయింతువయ్య నళినదళాక్షా!
పటుతరమగు నీ మాయలు
నిటలాక్షుడు తెలియదగునె నిజమిది శ్రీశా! 56

తాత్పర్యము : శ్రీశా! వటపత్రంపై పసిబాలునిలా పరుండే స్వామీ! నీవు ఈ భూలోకంలో ఎన్నెన్నో నటనలు చేయిస్తుంటావయ్యా. నళినదళాక్షా! పకడ్బందీతో కూడిన నీ మాయలు నొసట కళ్ళుగల పరమశివునికి కూడా తెలియరాదు. ఇది నిజం.

విశేషము : ప్రళయకాలంలో స్వామి పసిబాలుడై వటపత్రంపై పరుండి దర్శనమిస్తాడు. ఈ బాలకుణ్ణే కృష్ణకర్ణామృతకారుడు 'కరారవిందేన' అనే శ్లోకంలో రమణీయంగా వర్ణించాడు. స్వామి నటనలు అనంతం. దరిద్రుదు ధనికుడుకావడం, ధనవంతుడు కూటికోసం అర్రులు చాచడం గర్విరాజు పతనం కావడం, నవ్విన పల్లెలు పట్నాలు కావడం స్వామిదయతో మూగవాడు వాచాలుడు కావడం లాంటివి. మూడు కళ్ళున్న స్వామికి కూడా నీ మాయలు అవగతం కావు.

క॥ నీవే కర్తవు కర్మకు
నీవే కారకుడవయ్య నీరజనాభా!
నీవే ప్రేరణ జేతువుగా మరి
నీవే యనుమోదకుడవు నిజమిదె శ్రీశా! 57

తాత్పర్యము : శ్రీశా! బాగా ఆలోచిస్తే నీవే కర్తవు. కర్మలకు అధీశ్వరుడవు. నీవే కారణమైనవాడవు. నీవే ప్రేరేపించేవాడవు. నీవే ఆమోదించేవాడవు. భగవద్గీతసారమంతా ఈ పద్యంలో ఉంది. అన్నిటికి 'నేను' అనే భావన ఉన్నంతవరకు నిష్కృతిలేదు. 'నేను' అనే భావమున్నంతవరకు అహంకారానికి జయం. ఈ వేదాంతం పలాయనవాదం కాదు. వృద్ధాప్యంలో అవగతమయ్యే సత్యం. అర్జునుని రణవిహారానికి పురికొల్పించిన సత్యం. ఈ భావనలో తన-మన లేదు. ఇరుగు పొరుగు తేడాలేదు. ఉచ్చనీచాలు లేవు. సర్వం దైవాధీనం. బస్సులో కూర్చున్నాక నడిపేది బస్ డ్రైవరు. గమ్యం చేర్చేవాడు డ్రైవరు. మనం నిమిత్తమాత్రులం.

క॥ వీరుడగు జాంబవంతుని
పోరున యోడించి సుతను పెండ్లాడగ యా
ధీరుడు మణి నీకిడగా
కోరికతో సత్రాజిత్తు కొసగియు శ్రీశా! 58

తాత్పర్యము : శ్రీశా! వీరుడైన జాంబవంతుని పరాజితుని చేసి అతని కుమార్తె జాంబవతిని వివాహమాడినవేళ అతడు శమంతకమణిని ఇవ్వగా తాను స్వీకరించినా అద్దానిని సత్రాజిత్తునకే ఇచ్చినవాడవు.

శమంతకమణిని కృష్ణుడు అపహరించాడని సత్రాజిత్తు భావించాడు. తనపై వచ్చిన నిందను బాపుకోవడానికోసం కృష్ణుడే కదిలాడు. సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడు మరణించడం గుర్తించి జాంబవంతుని గుహలో ప్రవేశించి మణిని గుర్తించాడు. జాంబవంతునితో వీరోచితంగా పోరాడి అతనిని ఓడించాడు. జాంబవంతుడు తన ఓటమిని ఒప్పుకొని జాంబవతితోబాటు శమంతకమణిని ఇచ్చాడని ఐతిహ్యం. కాని కృష్ణుడద్దానిని తాను తీసుకోక సత్రాజిత్తుకే ఇచ్చి ఆ నిందనుండి బయటపడ్డాడు.

క॥ తాపసియగు దూర్వాసుదు
కోపముననన్నంబరీషు శోధన జేయన్
బాపురే మునిమద మణచియు
యాపదలో రేని గాచినాడవె శ్రీశా! 59

తాత్పర్యము : అంబరీషుడు విష్ణుభక్తుడు. ద్వాదశివ్రతానుచరుడు. తాపసులపట్ల గౌరవం కలవాడు. ఏకాదశీవ్రతపాలన ముగియనుండగా దుర్వాసుడు వచ్చాడు. అంబరీషుడు అతనికి ఆతిథ్యమివ్వదలచాడు. మరి దుర్వాసుడు తాను స్నానసంధ్యాదులను పూర్తి చేసుకొని వస్తానన్నాడు. ఎంతసేపటికి రాలేదు. వ్రతఘడియలు దాటిపోతున్నాయి. చివరకు ఆచార్య నియోగాన అంబరీషుడు జలపానం చేశాడు. తన్ను పారణకు ఆహ్వానించి ముందుగా జలపానం చేసినందుకు దుర్వాసుడు తన్నవమానించాడని కోపపడ్డాడు. కృత్యను ప్రయోగించాడు. ఆ సమయాన అంబరీషుని రక్షణార్థమై సుదర్శనచక్రం నిలిచింది. దుర్వాసుని వెంటబడింది. ఎక్కడ

తిరిగినా ఆశ్రయం దొరకక చివరకు దుర్వాసుడు అంబరీషుని శరణువేడాడని భాగవతకథ.

విశేషము : ఈ పద్యంలోని తాపసి, ముని సార్థకశబ్దాలు. ఈ రెండు లక్షణాలు లేనివాడు దుర్వాసుడు. ఆపదలో రక్షించినవాడే పరమాత్మ. భక్తులకోసం స్వామి సదా సంసిద్ధుడని భావం.

క॥ క్రతువు లొనర్చిన జిక్కవు
వ్రతములకుం జిక్క వీవు, వారిరుహాక్షా
యతిభక్తి గొల్చువారికి
కౌతుకమున జిక్కుదీవు కావగ శ్రీశా! 60

తాత్పర్యము : శ్రీశా! పద్మనయనా! భగవంతుడు ఎవరికి సామీప్యంలో ఉంటాడు అన్నది ప్రశ్న. భగవత్కృప ఎవరిమీద ఉంటుందనడం మరో ప్రశ్న. యాగాదులు చేయడంవల్ల చిక్కడు. వ్రతాదులవలన కూడా చిక్కడు. ఎవరైతే అచ్చపు భక్తితో సేవిస్తారో అలాంటివారికి చిక్కుతాడని భావం. ఆడంబరాలకు, అట్టహాసాలకు, వినోదాలకు, మంత్రతంత్రపఠనాదులకు చిక్కడు. అచ్చపు భక్తి కలవారికే స్వామి వశ్యుడు.

విశేషము : క్రియతే బ్రాహ్మణాదిభిరితి క్రతుః. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులచే చేయబడేది క్రతువు. శాస్త్రవిహితమైన నియమము వ్రతము.

క॥ కందర్పజనక! సుందర!
వందనములు జేతునయ్య వసుమతి యందున్
ఇందీవరశ్యామా, నా మది
మందిరమున నుండుమయ్య మాధవ! శ్రీశా! 61

తాత్పర్యము : శ్రీశా! నీవు మన్మథుని తండ్రివి. సర్వావయవ సుందరుడివి. సదా నీకే వందనములు. ఇందీవరశ్యామా! నా మనస్సనే మందిరంలో ఉండు. ఇదే నా కోరిక మాధవా!

విశేషము : కందర్పుడంటే కుత్సితదర్పం కలవాడని అర్థం. అలాగే సుందరశబ్దానికి సుతరాం ఆద్రియత ఇతి సుందరం. మిక్కిలి సంతోషపెట్టునది సుందరం అని విశేషార్థం. ఇన్ద్రియాణి వృణోతీతి వా ఇందీవరం – నల్లకలువ. అలాగే మందిరమంటే మాదతే సుప్యతేఽత్ర మందిరం మది స్తుతి మోద మద స్వప్నకాంతి గీతిషుం – గతిషు – సంతోషింపబడును గనుక మందిరం.

క॥ నారదవినుత! జనార్దన!
శ్రీరమణీమణీప్రియుండ! శ్రీధర! నాదౌ
భారము నీదె జనార్దన
ధరవర! లోకాన గావు దయతో శ్రీశా! 62

తాత్పర్యము : విష్ణుభక్తులలో విశిష్టుడైన నారదమహర్షిచే విశిష్టరీతిలో స్తుతింపబడేవాడా! జనార్దనా! లక్ష్మీదేవికి ప్రియుడైనవాడా! శ్రీధరా! నా భారము నీదేనయ ధరవరా! శ్రీశా! పాపపంకిలమైన ఈ లోకాన నన్ను కావుమయ్యా!

విశేషము : నారదుడు దేవర్షి. భక్తకోటి గణనంలో మొదట నుతింపబడేవాడు. సామాన్యజనుల మొరలు విని స్పందించేవాడు జనార్దనుడని ఇక్కడ అర్థం. స్వామిని వలచిన రమణులు ఎందరో. వారిలో ప్రథమగణ్య లక్ష్మీదేవి. శ్రీకృష్ణుని అష్టమహిషులలో రుక్మిణి అని సమన్వయం. గీతకళాదులు నేర్చి రమించునది రమణి. అలాగే లోక్యతే సర్వమస్మిన్ ఇతి లోకః. సర్వము దీనియందు గనబడును. లోక్యతే ఆలోక్యత ఇతి లోకః అని వ్యుత్పత్తి 'లోక దర్శనే'.

క॥ గోవర్ధనాద్రినెత్తియు
గోవుల గోపకుల గాచు గోవింద! హరీ!
కావుమ మము కరుణాత్మక!
నీవే మా దిక్కువయ్య! నిజమది శ్రీశా! 63

తాత్పర్యము : తనపేర ఉత్సవం చేయలేదని దేవేంద్రుడు గోగోపాలుర నివాసాలపై కుంభవృష్టి కురిపించినవేళ కృష్ణుడు గోవులను, గోపాలకులను రక్షించడానికోసం యాదవకులానికే సర్వదా రక్షకమగు గోవర్ధనాద్రినే గొడుగుగా ఎత్తి రక్షించాడు. స్వామీ! నీవు గోవులను సంతోషపెట్టువాడివి. పాపములను హరించువాడివి. కరుణాస్వభావుడవు. అలాగే మమ్ములను కాపాడుము. మాకు వేరే దిక్కులేదు. 'అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ' ఇది సత్యం. నీ నామావళిలో విశిష్టమైనది 'గోవింద' నామం.

క॥ నారదవినుత! జనావన!
భూరమణీ మణీప్రియుండ భువనాధీశా!
కారుణ్యధామ! యిల మా
భారము నీదే గదయ్య బాంధవ! శ్రీశా! 64

తాత్పర్యము : శ్రీశా! దేవర్షి నారదునిచే పొగడబడేవాడా! చుట్టూ సజ్జనులతో కూడినవాడా! సర్వశ్రేష్ఠ అయిన భూదేవికి ప్రియుడివి కదా! భువనాలకు అధిపతివి నీవే! కారుణ్యానికి నిలయం నీవే! ఇక నీవే అన్నిటికి రక్షకుడివి. నీవు మాకు బంధువు. బధ్నాతీతి బంధువు. ఈ బంధం పోయేది కాదు. తొలగించుకొనేది కాదు. కనుకనే లోకులు అనాథరక్షకా! ఆపత్ బాంధవా అని చేతులు జోడిస్తారు.

క॥ పాండవుల దైత ద్రోవది
మెండుగ మిము వేడుకొనగ మేదిని యందున్
దండిగ వల్వల నిడి యామెను
కుండలితల్పకుడు గాచినాడవు శ్రీశా! 65

తాత్పర్యము : శేషశయనా! ధర్మరాజాదులు పాండవులు. పాండవుల పత్ని ద్రోవది. అయినా కౌరవసభలో దుర్యోధనులచే భంగపడినవేళ

ఆమె దుఃఖాన్ని ఆర్చేవారు ఎవరూ లేరు. తీర్చేవారును లేరు. నిస్సహాయ అయిన ద్రౌపది నీవే గతి అని కృష్ణుని వేడుకోగా వస్త్రాపహరణానికి అడ్డుపడి మానరక్షణ చేశావు. పాండవవంశ ప్రతిష్ఠ నిలిపినావు. ఈ పద్యంలో దైత అనడానికన్నా దయిత అంటే బాగు. 'కుండలితల్పకు'డంటే పామును తల్పంగా కలవాడని అర్థం.

కII హింసను ప్రేరేపించిన
కంసుని తెగటార్చినావు కౌస్తుభధారీ!
హింసను తొలగించుచు మా
వంశంబును వెలుగజేయు వసుమతి శ్రీశా! 66

తాత్పర్యము : శ్రీశా! నిన్ను మట్టుపెట్టాలని కంసుడు ఎందరినో ప్రేరేపించాడు. కాని ఏమి చేయలేకపోయాడు. నీవే లోకకంటకుని కంసుని సంహరించినావు. కౌస్తుభం ధరించినవాడా! మా వంశానికి కలిగే హింసలను తొలగిస్తూ వంశం వెలిగేలా చేయవయ్యా!

విశేషము : సముద్రమందు పుట్టినది, విష్ణువు యొక్క మణిపేరు కౌస్తుభం. భూమిని నిలిపిన విష్ణుని సంబంధమైనదని అమరంలో వివరణ. ఈ పద్యంలో వంశమనడంలో రక్తసంబంధవంశం కావచ్చు. భక్తజనవంశం కావచ్చు.

కII పాండవ పక్షము నుండియు
గాండీవికి పెండ్లి నీవె గావించితివే
అండజవాహన! నీవా
దుండగులగు కౌరవాళి దునిమియు శ్రీశా! 67

తాత్పర్యము : శ్రీశా! అందరికి తెలుసూ నీవు పాండవపక్షపాతివని. కపట పరివ్రాజకరూపంలో వచ్చిన గాండీవికి ఆశ్రయమిచ్చావు. సోదరి

సుభద్రను ఆ యతికే (కపట సన్యాసికే) శుశ్రూష చేయ నియమించావు. సుభద్రార్జునుల కల్యాణం ఆటంకాలు లేకుండా జరిపించావు. ఆ సమయాన కసితో వచ్చి ఎదుర్కొనిన దుండగులను కౌరవసమూహాన్ని సంహరించావు.

విశేషము : గాండీవమును ధరించినవాడు గాండీవి. నునుపుగా చేయబడని గణుపులు గల విల్లు అని అర్థవిశేషం.

కురువంశజులు కౌరవులు. పాండవులు కౌరవులే. కాని రూఢ్యర్థంలో దుర్యోధనాదులకే కౌరవులని ప్రసిద్ధి.

క॥ జయ జయ శౌరి! ముకుందా!
జయ జయ సురలోకవంద్య! శోభితచరణా!
జయహెూ కమలారమణా!
జయ జయ మము గావు కరుణ జగతిని శ్రీశా! 68

తాత్పర్యము : ఇది జయాదినామక కందం. శౌరికి జయమగుగాక ముకుందునికి జయమగుగాక. దేవతలచే నుతింపబడే మంగళ చరణములు కలవాడా! నీకు జయము జయము. లక్ష్మీదేవికి రమణుడవైన స్వామీ! నీకు జయము. జగతిలో మమ్ము కరుణతో అన్నివిధాల కాపాడే స్వామీ నీకు జయము జయము.

క॥ ఖాండవ మగ్నికి నిడి, యా
గాండీవము చక్రములను గణియించితివే
భండనమున పార్థునిచే
దండించితి వీవు వజ్రి! ధరవర! శ్రీశా! 69

తాత్పర్యము : శ్రీశా! ఈ పద్యంలో రెండు అంశాలున్నాయి. మొదటిది ఖాండవవనదహనవృత్తాంతం. రెండవది అర్జునుని రూపంలో దేవేంద్రునికి శిక్ష.

విశేషము : శ్వేతకి ధారపోసిన నేతితో అగ్నికి అజీర్ణవ్యాధి ప్రాప్తించెను. ఖాండవవనదహనంతో అజీర్ణవ్యాధి పోతుందని బ్రహ్మ చెప్పాడు. కాని అగ్ని కాల్చలేకపోయాడు. చివరకు బ్రహ్మ కృష్ణార్జునుల సహాయ మడగమన్నాడు. తమ్ము ప్రార్థించిన అగ్నిదేవునితో అర్జునుడు మాకు ఆయుధాలుగాని, పోరాటానికి తగిన రథాలు లేవు కదా అన్నాడు. అగ్ని వరుణుని ప్రార్థించగా అక్షయతూణీరం, తగిన రథం, రథానికి తగిన అశ్వాలు, విల్లు అలాగే కృష్ణునికి త్రిశూలంలాంటి ఆయుధాలు కావలెనంటే అన్నీ సమకూర్చగా అగ్ని రెట్టింపు విశ్వాసంతో ఖాండవ వనాన్ని కాల్చాడు. దేవేంద్రుడు తన రక్షణలోని వనం కాల్చబడడం చూసి వర్షం కురిపించాడు. అర్జునుడు బాణవర్షంతో దేవేంద్రుని వర్షధారలు కురియకుండా చేశాడు. అర్జునుని కారణంగా దేవేంద్రునికి పరాభవం కలిగింది. పృథకుమారుడు (కుంతి) పార్థుడు. వజ్రాయుధ ధారికనుక దేవేంద్రునికి వజ్రి అని పేరు. చక్రమన్నప్పుడు త్రిశూలాకార చక్రమని ఒక వ్యాఖ్యానం.

కు॥ దామోదర గోవిందా
శ్రీమహిళాచిత్తచోర శ్రితజనపాలా
నీ మహిమ లెన్న దరమా
కామజనక! కరుణ మమ్ము గావుము శ్రీశా! 70

తాత్పర్యము : శ్రీశా! ఉదరమందు తులసిమాలిక గలవాడా! గోవిందా! బాల్యమందు యశోదచేత ఉదరమునందు కట్టబడినవాడా! లక్ష్మీదేవి స్వరూప అయిన రుక్మిణీదేవి చిత్తమును హరించినవాడా! ఆశ్రితజనులను పాలించువాడా! నీ మహిమలను లెక్కపెట్టడం సాధ్యమా! మన్మథుని తండ్రీ! కరుణతో మమ్ము కాపాడుము. తపోనిష్ఠులైన మునీంద్రులచే కట్టబడనివాడు, జపతపవ్రతాదులచే కట్టబడినవాడు, కృష్ణావతారంలో తల్లిచేత కట్టుబడడం చిత్రం. ఇదే స్వామిలీలావిశేషం.

కII గోవర్ధనధర! శ్రీహరి!
శ్రీవర! శ్రితకల్పభూజ! శ్రీవత్సాంకా!
తావక దాస్యము జేతును
భూవర! మము గావుమయ్య భువిలో శ్రీశా! 71

తాత్పర్యము : శ్రీశా! గోగోపాలురకోసం గోవర్ధనపర్వతం ఎత్తినవాడా! లక్ష్మీదేవితో కూడిన హరీ! శ్రీని వరించినవాడా! ఆశ్రితులకు కల్పవృక్షం లాంటివాడా! శ్రీవత్సచిహ్నం కలవాడా! నీకు నేను దాస్యం చేస్తాను. ఈ లోకంలో మమ్మల్ని కాపాడవయ్యా!

హరి స్తోత్రప్రియుడు. 'నోరు నొవ్వంగ హరికీర్తి నుడువదేని' అని భాగవతవాక్యం. కనుకనే నామావళితో ప్రార్థన. భక్తి అనేకరకాలు. నవవిధ భక్తిమార్గాలలో దాస్యం ఒకటి. ఆంజనేయస్వామి దాస్యభక్తికి తగిన ఉదాహరణ. అంతేకాదు వైష్ణవంలో దాసదాసానుభక్తిని గొప్పగా వర్ణించింది. కనుక కవి ఈ పద్యంలో దాస్యాన్ని కోరుకొన్నాడు.

కII బలభద్రానుజ! కృష్ణా!
అల యర్జునకందనుండి యానందపడన్
ఇల జరిపించితివే దేవా
కలికి సుభద్రమ్మ పెండ్లి కరణశ్రీశా! 72

తాత్పర్యము : కృష్ణా! నీవు బలభద్రుని సోదరుడవు. అర్జునునికి అన్నివిధాల అండ. కనుక కృష్ణా! అర్జునుని ఆంతరంగికభావాన్ని, తన చెల్లెలు సుభద్ర అంతరంగాన్ని సమన్వయించుకొని వారిరువురి వైవాహికానుబంధానికి పథకం వేశావు. నీవు దేవుడవు. కనుకనే ఇది సాధ్యం కాగలిగింది.

కII జననీ జనకులు మీరే
అనవరతము బోధచేయు నతుల గురుడవే
కనరాని చెలుడ వీవే
వనమాలీ గతియు నీవె వసుధశ్రీశా! 73

తాత్పర్యము : శ్రీశా! నీవే మాకు తల్లిదండ్రులు. అంతేకాదు సదా సద్బోధలు చేయు గురుడవు నీవే. ప్రాకృతిక నేత్రాలకు కనిపించని సుందరాకారుడవు నీవే వనమాలీ! నీవే మాకు గతి. వేరే గతి మాకు లేదు. అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ అని భావం. లోకులకు తల్లి, తండ్రి, గురువులు వేరు వేరు. కాని భక్తునికి భగవంతుడే అన్నీ అని విశేషార్థం.

క॥ సాధుజనావన! శ్రీకర!
బాధలు మరి బాప రావె బంధుడ వీవే
సాదరముగ నీ దయతో
వేదన లేకుండ వెతల దీర్పుము శ్రీశా! 74

తాత్పర్యము : శ్రీశా! పరుల కార్యాలను సాధించువాడు సాధువు. శుభమును సాధించువాడు కూడా సాధువు. సజ్జనునికి సాధువని పేరు. సదా సాధుజనులతో చుట్టబడినవాడా! మంగళమును ప్రసాదించువాడా! నీవు నా బంధుడవు. మా బాధలను పోగొట్టరాదా. వేదనలేకుండా చేయరాదా! మా వ్యథలను తీర్పరాదా! బాధలు అనేకరకాలు. శారీరకబాధలు, మానసికబాధలు. అన్నిరకాల బాధలను తీర్చమని కవి ప్రార్థన.

క॥ విత్తము కొరకై నిరతము
చిత్తంబును నిల్పి నరులు చెడుచుందురుగా
విత్తమదె వెంట వచ్చునె
చిత్తము మీపైన నిల్పు చెదరయ శ్రీశా! 75

తాత్పర్యము : శ్రీశా! ఈ కలియుగంలో ప్రతివారు ధనసంపాదనే ధ్యేయంగా మనసా ఆలోచిస్తుంటారు. ఈ కారణంగా బాగుపడడానికి బదులు నాశనమవుతున్నారు. రకరకాల మోసాలతో, కుతంత్రాలతో, కుత్సితాలతో సంపాదించిన డబ్బు వారివెంట వస్తుందా? నీపైననే చిత్తము నిలిపితే వారేనాటికీ చెదరు.

'ధనమూల మిదం జగత్' డబ్బుసంపాదన అడ్డమైన మార్గాలకు, మోసాలు, హత్యలు, తన మన అనే తారతమ్యాన్ని మరపించేది. విత్తం వలననే కలహాలు. విత్తసముపార్జన ఒకటే మనిషికి ధ్యేయము కారాదు.

క॥ మనమున మీ రూపమ్మిడి
దీనావన భక్తి గొల్చి దీవెనలందన్
ఏనాటి పుణ్యఫలమో
నానాటికి నాకు దక్కెననుచున్ శ్రీశా! 76

తాత్పర్యము : శ్రీశా! మనసులో నీ రూపాన్ని నిలుపుకొంటున్నా. భక్తితో సేవిస్తున్నా. నీ దివ్యదీవెనలందుకొంటున్నా. ఇవన్నీ ఏ జన్మ పుణ్యఫలమో ఈ జన్మకు ఆ భాగ్యమంటూ నిరతం స్మరిస్తున్నాను.

ఎంతో పుణ్యం చేసుకొంటేగాని భగవద్భక్తుడు కావడం కష్టం. ఒకవేళ అయినా ఆ స్వామి సుందరాకారాన్ని మనసులో నిలుపుకోవడం అంత తేలిక కాదు. అంతేకాదు స్వామి నీ అనుగ్రహం దీవెనల రూపేణ ఫలిస్తున్నాయి. ఇవన్నీ ఏనాటిదో! జన్మజన్మాంతర పుణ్యఫల మనుకొంటాను.

క॥ చెరచుటలు ఆత్మహత్యలు
మరచిరి యనుబంధములను మానవులెల్లన్
గారవము కరుణ తగ్గెను
ఈ రకముగ చెడులు వెలసె నిమ్మహి శ్రీశా! 77

తాత్పర్యము : స్వామీ! ఈ లోకంలో ఎన్నిరకాల చెడులో! అభం శుభం తెలియని కన్యలను చెరచడం, తన బాధలు చెప్పుకోలేక, బాధలు తీర్చేవారు లేక రకరకాల కారణాలతో ఆత్మహత్యలు చేసుకొనేవారెందరో. ఇంకా చిత్రం మానవుల మధ్య చిరకాలంగా ఉన్న మమతానుబంధాలు అలాగే చిన్నపెద్ద అనే గౌరవాలు అన్నీ భ్రష్టమయ్యాయి. ఈ మానసికక్షోభ భరించరానిది.

పుణ్యపాపాలనే భయంలేకపోవడం, క్షణికానందమే పరమార్థ మనుకోవడం చెరచడానికి కారణమయ్యాయి. ఆత్మహత్య మహాపాపం. పిశాచాదుల రూపేణ ఆయువు తీరేదాకా భూలోకంలో జీవించవలసి వస్తుందనే భీతిలేకపోవడం ఆత్మహత్యకు కారణాలవుతున్నాయి. అన్నదమ్ముల, భార్యాభర్తల, చుట్టాల మధ్య, గురుశిష్యుల మధ్య అనుబంధాలు బెడిసికొట్టాయి. మానవత్వం మంటకలిసిపోతుందని కవి ఆవేదన.

క॥ ఆదరమున మిము గొల్వగ
మాధవ మిము గానలేక మనుచుంటిమయా
మధుసూదన, వరదాయక
క్రోధము మాపైననేల, కోరితి శ్రీశా! 78

తాత్పర్యము : శ్రీశా! మాధవా! మధుసూదనా! వరదాయకా! నిన్ను సేవించాలని నా తపన. కాని నీ దర్శనభాగ్యం దక్కలేదు. ఆ తపన తపనగానే మిగిలిపోయింది. నాపై నీకు కోపం కాబోలు. పాపి, దుర్మార్గుడు క్షమార్హుడు కాడు. శిక్షార్హుడనే కోపమేమో. ఆ కోపం నాపట్ల చూపకు. నన్ను కరుణించు.

కోపతాపాలు మానవులకే భగవంతునికి లేవు. కాకపోతే భక్తునిపట్ల కనిపించే అనాదరణలాంటివి నాటకాలే, పరీక్షలే.

క॥ నీరజనాభ! పరాత్పర!
మారజనక! దిక్కు మీరె మాధవ! శౌరీ!
నీరదశ్యామా! దయతో
కరుణన్నీ జనమునెల్ల గావర శ్రీశా! 79

తాత్పర్యము : పద్మనాభా! పరాత్పరా! మన్మథుని తండ్రీ! మాధవా! శౌరీ! నల్లని మేఘంలాంటి వన్నెకలవాడా! దయతో నిన్ను నమ్మినవారిని, నిన్ను కొలిచేవారిని కాపాడరాదా!

స్వామీ! నిన్ను నమ్మనివారు లోకంలో ఎందరో! నీవు లేవని ప్రకటించేవారెందరో! నీ భక్తులను చులకనగా చూసేవారెందరో! అయినా లోకంలో నిన్ను నమ్మేవారున్నారు. నీవే సర్వస్వమని భావించి కొలిచేవారున్నారు. వారినయినా కాపాడవలసిన బాధ్యత నీకు లేదా! నీరదశ్యాముడివి. నల్లని మేఘాలే కురుస్తాయి. అలాగే నిన్ను నమ్మినవారిపై వరములను కురిపింపరాదా అని దైన్యప్రకటన.

కII బీభత్సున కాదరమున
శుభములు సేకూరుదనుక సురుచిరలీలన్
శ్రీభగవద్గీతను దెల్పియు
భూభరమును దీర్చినావు భూవర శ్రీశా! 80

తాత్పర్యము : శ్రీశా! అర్జునుని నామాలలో బీభత్సనామం ఒకటి. రణరంగంలో బలసమృద్ధమైన చతురంగబలాన్ని చీల్చి చెండాడి బీభత్సం చేయగలిగినవాడైన అర్జునుని పట్ల ఆదరంతో శుభం కలిగించాలనుకొన్నావు. సురుచిరలీలతో (ఉపదేశానికి తగిన స్థలం, ఉపదేశానికి తగినకాలం, ఉపదేశ ప్రయోజనం అన్నీ ఆలోచించి ముందు నిర్వేదాన్ని బాపి ధైర్యాన్ని ఉసిగొల్పి, కర్తవ్యమే పరమార్థమంటూ దిట్టతనం ఉద్దీపింపజేసి) గీతను బోధించినావు. కురుక్షేత్రసంగ్రామం సాగనిచ్చి 18 రోజుల యుద్ధంలో భూభారాన్ని తగ్గించావు. నీవే భూదేవికి తగిన వరుడవు.

కII సుందరరూప! జనార్దన!
వందనమయ! వాసుదేవ! వనజాక్ష! హరీ!
మందస్మిత! నీ రూపం బా
నందము గల్గించు నెపుడు నచ్యుత! శ్రీశా! 81

తాత్పర్యము : శ్రీశా! ఆకర్షకమైన ఆకారం కలవాడా! జనార్దనా! వందనమయా! వాసుదేవా! వనజాక్షా! హరీ! మందస్మితా! అచ్యుతా! నీ స్వరూపం సర్వదా ఆనందము కలిగిస్తున్నది శ్రీశా!

కవి బహుశః శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళాకారాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ పద్యం వ్రాసివుండవచ్చు. సుప్రభాతంలో సర్వావయవ సౌందర్య శోభితునిగా స్వామిని వర్ణించింది. లోకంలో కొందరిని చూడగా చేతులెత్తి నమస్కరించాలనిపిస్తుంది. శ్రీనివాసస్వామిలో కనిపించే విశేషం 'చిరునవ్వు'. 'చెక్కిళ్ళ చిరునవ్వు చిందుచున్నెడీడ' అని ఒక సంబోధన. శ్రీరామునిలో కనిపించే విశేషలక్షణమిది. స్మితభాషిత్వం. స్వామిదర్శనం వల్ల కలిగే ఆనందం వర్ణనాతీతం. ఇది నేటికీ అనుభవంలోని అంశమే.

కII ధర్మము కనుమరుగాయెను
నిర్మలమతి వీడి నరులు నీతియు దప్పెన్
మర్మముతో నున్న వారల
దుర్మార్గము నాపరావ దయతో శ్రీశా! 82

తాత్పర్యము : శ్రీశా! లోకంలో ధర్మం కనుమరుగైంది. నరులు నీతులు తప్పుతున్నారు. అంతేకాదు మర్మకార్యాలతో దుర్మార్గాలు చేస్తున్నారు. వారిని ఆపరాదా!

'ధర్మో రక్షతి రక్షితః' ధర్మమంటే ఇక్కడ సద్ధర్మం. చతుర్విధ పురుషార్థాలలో ధర్మం మొదటిది. గీత ధర్మశబ్దంతో మొదలై ధర్మశబ్దంతో అంతమవుతుంది. కళంకరహితులైన వారు కూడా కాలవశాన నీతిమార్గాన్ని వీడుతున్నారు. ఎక్కడ చూచినా కపటోపాయాలు కుమార్గాలు, వక్రభాష్యాలు. వీటిని ఎవరు ఆపగలరు? దేవుడొక్కడే. కనుక ధర్మసంస్థాపనార్థం నీతినియమపాలనకోసం, మర్మజ్ఞుల ఆట పట్టింపుకోసం దయతో రావయ్యా!

కII మానవతయె లేదు సుమీ
మానవులకు జూడ లేవు మమకారంబుల్
కానగ వచ్చును స్వార్థము
దీనావన! రమ్ము నిల్ప ధర్మము శ్రీశా! 83

తాత్పర్యము : శ్రీశా! ఈ కలియుగంలో ఈ రోజుల్లో మానవులని చెప్పుకొనేవారికి మానవత్వమే లేదు. పోనీ మమకారముందా అంటే అదీ సున్న. ఎక్కడ చూచినా స్వార్థం. దీనులను కాపాడే స్వామి, ధర్మం నిలుపడానికి నీవు రావాలి!

మానవ శబ్దానికి చాల అర్థాలున్నాయి. అన్నియు తమ వశమున ౘబొందించుకొనువారని విశేషార్థం. జ్ఞానం కలవాడని మరో వివరణ. మతంకంటె మానవత్వమే ముఖ్యం. మానవత్వం లేనివాడు మతాన్ని గురించి మాటలాడడం సరికాదు. సాటి మనిషిని మన్నించనివాడు మనిషే కాదు. 'మమ' అంటే నాదనే భావం. ఈనాడు బంధుత్వంలో, స్నేహంలో 'మమ' భావం పూర్తిగా నశించింది. స్వార్థం ప్రబలింది. కూడు, గుడ్డ, వాసం, పదవి, గౌరవం అన్నిటా స్వార్థం. స్వార్థదృష్టితో వైరవృద్ధి, హననాదులు.

క॥ మాధవ! ముకుంద! కేశవ!
ఆదరమున శంఖ, చక్ర, శార్ఙ్గము లెల్లన్
మోదమున చేత బూనుట
శ్రీధర! భువనమ్ము బ్రోవ శ్రీకర! శ్రీశా! 84

తాత్పర్యము : మాధవా! ముకుందా! కేశవా! స్వామీ 'నీవు పంచాయుధ ధారివి. ఇవన్నీ నీకోసం కాదు. భువనసంరక్షణార్థమే. శుభమును కలగచేసేవాడా!

విశేషము : మహావిష్ణువు పంచాయుధాలు

వింటి పేరు శార్ఙ్గము	
గద పేరు కౌమోదకి	కౌస్తుభం పేరు మణి
చక్రం పేరు సుదర్శనం	శంఖం పేరు పాంచజన్యం
కరవాలం పేరు నందకం	సంస్కృతంలోని 'పంచాయుధస్తవం'
	ప్రసిద్ధికల స్తోత్రం.

కు॥ శేషుడు తల్పంబౌటయు
విషభవ, భవజనని మిమ్ము వీడని సతియౌ
విషయుత స్వర్ణది సుతయై
విషధర రిపుగమన! వీరి సుకృతమె శ్రీశా! 85

తాత్పర్యము : శ్రీశా! ఈ పద్యంలో కవి మహావిష్ణువు కుటుంబాన్ని వర్ణించాడు.

స్వామీ! నీకు ఆదిశేషుడు, వేయితలలు గలవాడు పానుపు. సముద్రంలో పుట్టిన (సాగరాత్మజ) లక్ష్మీదేవి భార్య, నీ కుమార్తె గంగాదేవి. గరుత్మంతునిపై వెళ్ళేవాడా! ఆదిశేషువు, లక్ష్మి, గంగ, గరుత్మంతులు ఎంత సుకృతులు కదా!

విషశబ్దానికి గరళం, ఉదకం అని అర్థాలు. విషభవ అంటే ఉదకంలో పుట్టినది.

భవజనని అంటే బ్రహ్మదేవుని తల్లి. భవుడని బ్రహ్మదేవునికి కూడా పేరు. విషయుత అంటే నిండు నీళ్ళు గలది. సముద్రమని విశాలార్థం. నదులన్నీ 'హరిపాదపంకజభవాః' అని స్తోత్రాదులలో వర్ణితము.

విషధరరిపుగమన. విషాన్ని ధరించేది పాము. ఆ పాముకు విరోధి గరుత్మంతుడు. గరుడగమనుడు స్వామి. పరస్పరం వైరముగలవారితో గడిపే స్వామీ, నీ అండనున్నవారు సుకృతులే కదా!

కు॥ దీనజన కల్పభూజమ!
కానగ రావేలనయ్య కామితవరదా!
ఏనాటికి పాపఫలమిది
నీ నామము నుచ్చరింతు నిరతము శ్రీశా! 86

తాత్పర్యము : శ్రీశా! దీనజనులకు కల్పవృక్షం లాంటివాడవు. కోరినవారి కోరికలు తీర్చు వరదుడివి. మాకు కన్పించవేమయా ఎన్నో జన్మల పాపఫలితమే అయినా నీ నామసంకీర్తన తప్పక చేస్తాను.

కల్పవృక్షము, కామధేనువు, చింతామణి, పారిజాతం. ఇవి దేవలోకములోనివి. కోరిన కోరికలను తీర్చేవి. దీనులకు స్వామి కల్పవృక్షం. స్వామిసందర్శనం అంత సులభమా! వేల వేల సంవత్సరాల జన్మల పుణ్యఫలం వల్లనే అది సాధ్యం. అయినా నా ప్రయత్నం మానను. నామసంకీర్తనచే తప్పక ఆ అదృష్టం దక్కుతుందని విశ్వసిస్తున్నా.

కII భూతదయను మాకిడు మా
భూతలమున నీదు భక్తకోటితో చెల్మిన్
ప్రీతిగ మీ పదసేవయు
పీతాంబరధర, నొసంగు, ప్రేమను శ్రీశా! 87

తాత్పర్యము : శ్రీశా! నావి మూడు కోరికలు. మొదటిది భూతదయా భావం. రెండవది మీ పదసేవ. మూడవది భక్తకోటితో చెలిమి. ఇక్కడ భూతశబ్దం ప్రాణివాచకం. ఈ పద్యంలో సఖ్యతకు ప్రాధాన్యం. 'తను హృద్భాషల సఖ్యమున్' అనే పోతనపద్యాన్ని తలపింపచేస్తుందీ పద్యం.

ఈ పద్యంలో రెండవ పాదంలో యతి దోషముంది. కుతలంబున నీదు భక్తకోటితో అంటే యతి దోషముండదు. కుతలమన్నా, భూతలమన్నా ఒకటే.

కII నీవే నాకిలవేలుపు
నీవే నన్నాదరించు నీరదశ్యామా
నీవే మోక్షమ్మిడుమా
నీ వలరగ సేవ జేతు నిరతము శ్రీశా! 88

తాత్పర్యము : శ్రీశా! నీవు నాకు ఈ జగత్తున దేవుడివి. ఆదరించువాడవు నీవే. నీవే మోక్షాన్ని ప్రసాదించు. నీవు సంతోషపడేలా సేవచేసే భాగ్యం కల్పించు.

నీవే దేవుడవనడంలో పతివ్రతాభక్తి. నీవే ఆదరించువాడవనడంలో విశ్వాసభక్తి. నీవే మోక్షమొసంగుమనడంలో మోక్షాన్ని అనుగ్రహించే శక్తి నీకే ఉంది. ఇతరులకు లేదని భావం. నీవు సంతోషించేలా సేవచేసే శక్తి అనడంలో సామీప్యభక్తి కాంక్ష.

క॥ ఆశించను సిరిసంపద
లాశించను సుఖములెపుడు అంబుజనాభా
ఆశింతు ముక్తిపథమును
ఆశను దీర్పంగ గోరె దచ్యుత శ్రీశా! 89

తాత్పర్యము : నేను సిరిసంపదలను ఆశించడం లేదు. నేను రకరకాల సుఖభోగాదులను ఆశించను. నేను ఆశించేదల్లా ముక్తిమార్గపయనపథం. నా ఆశను అచ్యుతా! అంబుజనాభా! తీర్చు...

లోకంలో ప్రాణులకు ఇహపర భావాలు సహజం. ఇహం ఈ లోకానికి సంబంధించింది. పరం పరలోకాలకు సంబంధించినది. ఇహం అశాశ్వతం. పరం శాశ్వతం. ముక్తితో జననమరణాదులు జీవికి ఉండవు. దుఃఖాదులు లేవు. పరమాత్మసాంగత్యమే పరమావధి. చతుర్విధ పురుషార్థాలలో ప్రాణి కోరుకోవలసింది ముక్తి.

క॥ సుందర నీ చెల్మిని మరి
పొందిన వారలకె దెలియు పోకడలెల్లన్
కుందుదురు ఎల్లవారలు
బంధనములు ద్రెంచు భక్తిలేకనె శ్రీశా! 90

తాత్పర్యము : సుందర! నీతోడి నెయ్యము సలిపినవారికే నీ పోకడలన్నీ తెలుసు. లౌకికబంధాలు త్రెంచుకోలేనివారు భక్తిభావం లేక బాధపడుతుంటారు. భగవంతునితోడి భక్తి చెలిమి చాల చిత్రమైంది. సఖ్య భక్తి సర్వశ్రేష్ఠం. ఆ భాగ్యం అర్జునునికే దక్కింది. కుచేలునిది సఖ్యభక్తి. అతనికి కృష్ణుడు పరమాత్మ అని తెలుసు. అచ్చమైన భక్తిలేనివారికి దేవుని లీలావిలాసములు తెలియవు. శిశుపాలాదులు కృష్ణుని సామాన్యునిగా తలచారు. విశ్వరూపం ప్రదర్శించినా దుర్యోధనాదులు ఇదో మాయ అని తేలికగా తీర్పు పలికారు. భీష్మాదులు భక్తితో కృష్ణుని పరాత్పరునిగా భావించి అంపశయ్యపై పరుండినవేళ కూడా స్మరించారు. నమ్మినవారికి నారాయణుడు స్వామీ.

క॥ అలుకతో సుత్రాముడు
ఇలపైనే రాళ్ళవాన గురియింపంగా
కేలను గోవర్ధన మెత్తియు
అలగోవుల, గోపకులను గాచిన శ్రీశా! 91

తాత్పర్యము : త్రిలోకాధిపతి దేవేంద్రుడు, గోపాలకులు ప్రతి వత్సరం చేసే ఇంద్రోత్సవం చేయడాన్ని మాని గోవర్ధనపూజోత్సవం చేసేవేళ కోపంతో రాళ్ళవర్షం కురిపించాడు. అవ్వేళ కృష్ణుడు ఆ పర్వతమెత్తి గోవుల్ని, గోపాలకుల్ని కాచాదు. సుత్రామ శబ్దానికి 'సుష్ఠుం త్రాయత ఇతి సుత్రామా' లోకములెల్ల లెస్సగా రక్షించువాడని అమరం. ఈ ధర్మం పాటించలేదు కనుక కృష్ణుడు దేవేంద్రునికి సద్బోధ చేశాడు.

క॥ వర ప్రహ్లాదునకును నీ
వరయగ ఆ బలికి, మరియు నక్రూరునకున్
సరగున కైవల్యం బిడ
వరదా నీ కరుణ దెలియ వశమే శ్రీశా! 92

తాత్పర్యము : శ్రీశా! బాలుడైన ప్రహ్లాదునికి, అలాగే మూడు అడుగులు దానమిచ్చి శిరమువంచిన బలికి, అంతేగాక రేపల్లెకు బృందావనానికి వచ్చిన అక్రూరునికి కైవల్యం (మోక్షం) ఇచ్చావు. నీ కరుణ తెలియవశము కాదు.

తండ్రి హింసపెట్టినా, విష్ణుభక్తి వీడక, ఎక్కడా రాజీపడక అంతటా విష్ణువు ఉన్నాడని స్థిరమతితో చెప్పిన ఆ దృఢభక్తికి చలించి స్వామి నారసింహుడై ప్రహ్లాదుని కరుణించినాడు. అంతేగాదు రాక్షసజాతి జన్ముడైన బలిని పరీక్షించి మూడడుగుల దానమే అడుగగా, శుక్రాచార్యుడు వద్దన్నా 'దాస్యామి' అని దానమిచ్చిన బలిని కరుణించావు.

ఈ పద్యంలో అక్రూర ప్రస్తావన వుంది. అక్రూరుడు కంసుని ఆనతో బలరామకృష్ణులను ధనుర్యాగం నిమిత్తం ఆహ్వానించడంకోసం పంపబడిన వాడు. అక్రూరుడు కంసుని మనిషి అయినా మనసా కృష్ణభక్తి కలవాడు. రేపల్లెకు వెళ్ళమని కంసుడు ఆనతివ్వగానే సంతోషంతో కదలివెళ్ళాడు. ఇదంతా పూర్వజన్మసుకృతమనుకొన్నాడు. బలరామకృష్ణులను దర్శించినాడు. కృష్ణుని మనసారా స్తుతించాడు. వారితో మధురకు కదలినవేళ యమునలో తానమాడే వేళ రామకృష్ణులను దర్శించి ఆశ్చర్యపడ్డాడు. యమునలో చతుర్భుజాలతో కృష్ణుడు కనబడ్డాడు. స్వామీ! నీలో లేని వింతలు ఏ లోకాలలోను లేవు. నీటిలో, నేలలో, నింగిలో లేవన్నాడు. అలాంటి భక్తుని కృష్ణుడు కరుణించాడు. కనుకనే భజనగోష్ఠులలో అక్రూరవరదా! గోవిందా! అనడం.

కైవల్య శబ్దము పోతనకు చాల ఇష్టం. 'శ్రీకైవల్య పదంబు చేరుటకునై చింతించెదన్' అని అతని ప్రార్థన. శరీరేంద్రియాలతో బాసినా ఆత్మ అద్వితీయంగా ఉండడమే కైవల్యమని అమరం.

కII క్షీరార్ణవంబునందున
శిరములు వేయున్న శేషపానుపుపైనన్
నిరతము పవళించితివే
శ్రీరమ నీ సేవజేయ శ్రీధర శ్రీశా! 93

తాత్పర్యము : శ్రీశా! వేయితలలుగల ఆదిశేషుని పాన్పుగా చేసుకొని పాలకడలిలో పవళించినావు. ఆ సమయంలో లక్ష్మీదేవి సేవచేస్తుంటే హాయిగా నిదురించినావు. రమత ఇతి రమా – క్రీడించునది రము క్రీడాయామ్ అని అమరం. తన్ను సంప్రీతిగా ఏలుకొనేవాడు కనుక లక్ష్మి ప్రీతితో సేవ చేస్తుందని విశేషార్థం.

విశేషము : శేతే హరిః అస్మిన్నితి శేషః – హరి ఇతని మీద శయనించును అని ఒక అర్థం. కల్పాంతమునందును మిగిలి ఉండేవాడని మరొక అర్థం. అర్ణాంసి సంత్యన్నితి అర్ణవః జలములు కలిగినదని అమరం.

కII పాతకము లెల్ల దొలగును
చేతమునం దలచిన వారికి సేవలు జేయన్
ప్రీతిని యర్చన జేసిన
నుతియించిన మోక్షమిచ్చుచుందువు శ్రీశా! 94

తాత్పర్యము : శ్రీశా! నిన్ను సేవించేవారికి, ప్రీతితో అర్చన చేయువారికి, నోరు నొవ్వంగ హరికీర్తి నుతియించినవారి పాపాలను ప్రక్షాళనం చేసి మోక్షం ప్రసాదిస్తావు.

విశేషము : 'చేతయతి చిత్తం చేతశ్చ – చితి సంజ్ఞానే తెలియజేయునది అని అమరం. అర్చ్యత ఇతి అర్చా–అర్చ పూజాయాం అర్చింపబడునది అని అమరం.

కII సప్తగిరివాస! రమణా!
సప్తరుషులు నిన్ను మదిని సంస్తుతిజేయన్
తృప్తిపడి వారి కిలలో
ముక్తిని నీవొసగినావు ముదమున శ్రీశా! 95

తాత్పర్యము : శ్రీశా! ఏడుకొండలస్వామీ, భక్తజనుల హృదయాలలో రమించువాడా! అత్ర్యాది సప్తఋషులు నిన్ను మనసా సంస్తుతి చేయగా సంతోషించి వారు సంతోషపడే విధంగా ముక్తిని ప్రసాదించావు. శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలో ఋషులెందరున్నా 'అత్ర్యాది సప్త ఋషయః' అని పేర్కొనబడ్డారు.

కII వేంకటరమణా! నీ విటు
సంకటపడు జనులనెపుడు సరిజేతువయా!
పంకజభవ శివవందిత
ఇంకా మము బ్రోవవయ్య ఇలపై శ్రీశా! 96

తాత్పర్యము : శ్రీశా! వేంకటేశ్వరా! రకరకాల సంకటాలతో బాధపడేవారి సంకటాలను తొలగద్రోసి సరిచేస్తున్నావయ్యా! పద్మంలో జనించిన బ్రహ్మ, మరి శివునిచే పొగడబడేవాడా! ఇంక మమ్మల్ని కావుము. జననం మొదలు మరణం దాకా జీవికి రకరకాల సంకటాలే **సంకట బందాగె వెంకటరమణా** అని పురందరదాసు కీర్తన.

కII అంతము ఆదియు లేని, ని
రంతర సంతోషదాయి నీరజనాభా!
ఇంతకు శ్రీసతివిభుడా!
సుంతయినను జనుల గతులు జూడుము శ్రీశా! 97

తాత్పర్యము : నీవు సంతోషమును ప్రసాదించేవాడివి. ఆ సంతోషానికి ఆదిగాని, అంతముగాని లేదు. నిరంతరం ఉండేది. ఇంతకు నీవు నీరజనాభుడవు మాత్రము కాదు. శ్రీసతీవిభుడవు. ఈ కలియుగ జనులను కాసంత పట్టించుకోవయా!

కII గోవుల గాచుటకొరకై
నీవా గోపకుల గూడి నెయ్యముతోడన్
శ్రీవర చల్దులు గుడిచియు
అవ్వారికి తోడునీడవైతివి శ్రీశా! 98

తాత్పర్యము : నీవు గోపాలకులకు తోడునీడవు. కనుకనే వారితో కలిసి కాననానికి కదిలావు. వారితోబాటు నీవును గోవులను గాచావు. స్నేహభావంతో వారితో చలుదులు సేవించినాడవు. నీ సమభావం ప్రశంసార్హం.

కII గళమున తులసీదామము
కళగా చక్రమ్ము, శంఖుకరముల వెలయన్
వ్యాళంబు పానుపాయెను
కళలతో విలసిల్లె కౌస్తుభమ్మది శ్రీశా! 99

తాత్పర్యము : కంఠాన తులసీమాల, చేతబట్టిన సుదర్శనాయుధం అలంకారప్రాయంగా (శతృసంహారకళగా) చేత శంఖం ప్రకాశింపగా ఆదిశేషుడు పానుపుకాగా, కౌస్తుభము వక్షఃస్థలసింగారమగుచు వెలిగే శ్రీశా!

కణ్ఠో గళః – డాఞ్దానే – సంపూర్వో బంధనార్థః. నిలుచున్న, శయనించిన దేవుని తలనుండి చూడాలని ఒక సంప్రదాయం. కనుక కవి స్వామికంఠాన్ని, ఒక చేత చక్రాన్ని, మరోచేత శంఖాన్ని ధరించి శయనించిన స్వామి ఉరంలోని కౌస్తుభాన్ని దర్శించాడు. అన్నీ కళాత్మకాలే. ఈ కళ సౌందర్యాత్మకమే కాదు రణరంగశత్రుగళనిగర్హణాత్మక కళ.

కII హింసాత్మకుండు మామగు
కంసుని వధియించినావు కౌస్తుభధారీ
హింసవిదూరా మురహర!
ధ్వంసంబును జేసినావు దనుజుల శ్రీశా! 100

తాత్పర్యము : శ్రీశా! ఎదనిండా హింసాభావంగల కంసుడు నీ మామ. నీపట్ల మరీ హింసాస్వభావం కలవాడు. ఎన్నిరకాల హింస పెట్టినా సహించి

చివరకు ఆ కంసుని నీవు వధించావు. నీవు సామాన్యుడవు కావు. కౌస్తుభధారివి. సజ్జనులపై ప్రదర్శించే హింసకు దూరమైనవాడవు. మురుని సంహరించినవాడవు. దనుజులను ధ్వంసము చేసినావు. దనుజశబ్దానికి దనువు, ఆ దనువు నుండి పుట్టినవారు దనుజులు.

క॥ పురుషోత్తమ! పుడమిధవా!
మురహర! శ్రీనివాస! దేవమునిజనపాలా,
వరదాయక! గోవిందా!
సరసిజదళనేత్ర! జగతి గావుము శ్రీశా! 101

తాత్పర్యము : ఈ కందపద్యం నిండా సంబోధనలే. తల్లికి తమ పిల్లల గురించి ఎంత చెప్పినా తనివి తీరదు. అలాగే భక్తునికి తాను కొలిచే దేవుని రూపలీలావిశేషాదులను ఎంత పొగడినా చాలదు. ఈ సంబోధనలన్నీ ఈ పద్యంలో జనులను కాపాడుమనే అభ్యర్థన కోసమే. జనులంటే కలవారు, లేనివారు, పురుషులు, స్త్రీలు, పుణ్యాత్ములు, పాపులు ఇలా అనేక రకాలు.

క॥ మదనుడు నీ సుతుడిల
సదయుడు సితికంఠుపైన శరములు వేయన్
హృదయము కోపంబందగ
మదనుని భస్మంబు జేసె మృడుడిల శ్రీశా! 102

తాత్పర్యము : శ్రీశా! నీ కుమారుడు మదనుడు. పార్వతిపై మోహం పెరిగేలా శివునిపై మన్మథాస్త్రం వేశాడు. శివుడు కోపంతో మదనుని భస్మం చేశాడు. మదనుడంటే మదయతీతి మదనః మదింపచేయువాడు. హాలాహలభక్షణం చేసి కంఠాన నిలిపినవాడు కనుక సితికంఠుడు. లక్ష్యం లక్షం శరవ్యం చ. లక్షం చ. లక్ష్యత ఇతి లక్ష్యః చూడబడునది కనుక లక్ష్యము లక్షమును. బాణములచే కప్పబడునది. గుఱిపేరు.

కII కలవా దీనజనావళి
ఇలలో అణువణువు నీవె యందురు దేవా
దెలియ దరమ నీ మహిమలు
తలలే వేయున్న శేషుదరమా? శ్రీశా! 103

తాత్పర్యము : శ్రీశా! నీవు దీనజనులపట్ల ఉన్నావా. అణువు అణువునందున నీవున్నాడంటున్నారే. దేవా! నీ మహిమలు అనంతం. వాటిని అర్థం చేసుకోవడం సామాన్యులకు సాధ్యం కాదు. వేయితలలుగల శేషునికి కూడా అసాధ్యం.

భగవంతుడు పాలకడలిలో ఉన్నాడు. వైకుంఠములోను ఉన్నాడు. ఇవి సత్యాంశాలే. అంతేకాదు స్వామి అన్నిటా అణువు అణువు ప్రత్యణువులోను ఉన్నాడు. స్వామి నీ లీలావిభూతులనంతం. వర్ణనకు అతీతం. గణించడానికి అసాధ్యం.

కII శ్రీ పరమాత్మ! దయామయ
శ్రీపతి నీ స్మరణ జేయు నాశ్రితులెల్లన్
నీ పదపద్మంబులు గొల్చిన
తాపసమందార! వారే ధన్యులు శ్రీశా! 104

తాత్పర్యము : ఓ పరమాత్మా! దయాస్వరూపా! శ్రీపతీ! లోకంలో ఆశ్రితులు ధన్యులు. నీ పదపద్మంబులు గొలిచినవారు ధన్యులు. నీ గుణకీర్తనం చేసేవారు ధన్యులు. సుకృతీ పుణ్యవాన్ ధన్యః అని అమరం.

కII నీ రూపము నీ నామమె నే
మరువగ లేకయుంటి మధుసూదన! నీ
వా రమతో గూడియు
వారక నా సదనమందు వరలుము శ్రీశా! 105

తాత్పర్యము : శ్రీశా! నా కొక చిన్న కోరిక! నేను నీ రూపాన్ని గాని నీ నామాన్ని గాని ఎపుడూ మరచిపోలేదు. సదా నీ రూపధ్యానమే. సదా నీ నామస్మరణే. అందువల్ల మధుసూదనా! నీవారితో నీ పరివారంతో నా ఇంట నిలువవయ్యా! ఈ ప్రార్థనలో 'సదనము' ఇల్లు కావచ్చు. మానససదనమూ కావచ్చు.

కII నీ నామము నేనుడువగ
ఏ నోముల ఫలమొ పూర్వపుణ్యఫలమ్మో
కానగ రావా! నీవిటు
దీనావన కరుణజూడు దీరుగ శ్రీశా! 106

తాత్పర్యము : స్వామీ! నీ పేరు ఈ జన్మలో స్మరిస్తున్నానంటే, నోరార పలుకుతున్నానంటే, కీర్తిస్తున్నానంటే పూర్వజన్మలో చేసిన నోముల ఫలం కావచ్చు. జన్మజన్మాంతర పుణ్యపరిపాకం కావచ్చు. నిన్ను దర్శించాలని వుంది. నీవు రావా! కనబడవా! నన్ను దయతో చూడు.

కII వంకాయల నారాయణు
పంకజదళనయన! కరుణ పాలింపుమయా
ఇంకను జాలమదేలర
సంకర్షణ! వాసుదేవ! సరగున శ్రీశా! 107

తాత్పర్యము : శ్రీశా! నేను వంకాయల నారాయణ నామధేయుణ్ణి. స్వామీ! నీవు పద్మదళాల వంటి కనులు కలవాడివి. నన్ను కరుణతో రక్షించు. ఇంతగా ప్రార్థించినా ఆలస్యమెందుకు! సంకర్షణా! వాసుదేవా! శరణు. శరణు.

కII నా కావ్యకన్యనాథుగ
ఆ కమలాక్షున కంకితమ్ము గావింతు నిలన్
చేకొని కేశవుడును
నా కాయువు నారోగ్యమిచ్చి కాచును శ్రీశా! 108

తాత్పర్యము : శ్రీశా! నేను రచించిన లఘుకావ్యాన్ని ఆ కమలాక్షునికి అంకితం చేస్తున్నాను. ప్రీతితో ఈ గ్రంథాన్ని స్వీకరించి నాకు ఆయువు, ఆరోగ్యం ప్రసాదించి కాపాడుతాడని నా విశ్వాసం.

క॥ మంగళం భగవాన్విష్ణుః
మంగళం మధుసూదనా
మంగళం పుండరీకాక్ష
మంగళం గరుడధ్వజః
నీలాచలనివాసాయ నిత్యాయ పరమాత్మనే
సుభద్రాప్రాణనాథాయ జగన్నాథాయ మంగళం ॥ **109**

మంగళం మహత్

శ్రీశ్రీశ్రీ గోవిందాయ నమః

* * *